**విలేఖరులు కావలెను**

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ,
పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా **స్ఫూర్తి పబ్లికేషన్స్** వారి

# ధర్మఘంట

TELTEL/2012/47103

**తెలుగు జాతీయ దిన పత్రిక**

సంపుటి : 12 సంచిక :96 నల్గొండ | మంగళవారం 01-07-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 వెల : రూ.1/-


## పాశమైలారం కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు..మంటలు చెలరేగి పదిమంది దుర్మరణం



సంగారెడ్డి,జూన్26: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఉన్న సీగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో భారీ పేలుడు సంభవించడంతో పరిశ్రమ తునాతునకలైపోయింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఉదయం 9 గంటల సమయంలో సీగాచి కెమికల్స్‌లో పని సాగుతున్న సమయంలో రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పేలుడు ధాటికి కంపెనీ షెడ్డు పూర్తిగా కూలిపోయింది. మంటలు తక్కువ సమయంలోనే పరిశ్రమ మొత్తం వ్యాపించడంతో కార్మికులు బయటకు పరుగులు పెట్టారు. అయినప్పటికీ, పలువురు కార్మికులు మంటల్లో చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఐదుగురు కార్మికులు మంటల్లో సజీవదహనమయ్యారు. మిగతా మృతుల మరణానికి తీవ్ర గాయాలు కారణమయ్యాయని తెలుస్తోంది. శిథిలాల కింద ఇంకా 15 మంది కార్మికులు చిక్కుకుపోయి ఉండొచ్చని అనుమానించడంవల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. గాయపడ్డ 38 మందిలో 20 మందిని చందానగర్ ప్రభుత్వాస్పత్రికి, మరో 18 మందిని ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే 8 ఫైరింజన్లు ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తేవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. శిథిలాల తొలగింపునకు భారీ క్రేన్‌లు, హైడ్రా మిషన్‌లను రంగంలోకి దించారు. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ పూర్తిగా కూలిపోవడంతో సహాయక బృందాలు శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ప్రాణాపాయంగా శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ భవనం నుంచి కేవలం ఆరుగురినే బయటకు తీయగలిగారు. కెమికల్ ఫ్యాక్టరీలో మంటలతో పాటు భారీగా విషవాయువులు విడుదలవడంతో పరిసర ప్రాంతాల్లో ఘాటైన వాసనలు వ్యాపించాయి. స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతూ తమ ఇళ్లలోకి చెదురుమదురుగా చేరుకున్నారు. అప్రమత్తమైన అధికారులు సంఘటనా స్థలానికి ఎవరూ రావొద్దని హెచ్చరించారు. ఈ పేలుడు ఘటన రాష్ట్రాన్ని దిగ్భాం÷-రతికి గురిచేసింది. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అన్నదానిపై విచారణ కొనసాగుతోంది. శిథిలాల తొలగింపు తర్వాత అసలు ప్రమాద స్థాయి ఎంత పెద్దదో అర్థం కానుంది. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. పరిశ్రమ లోపల మరికొందరు చిక్కుకున్నట్లు సమాచారం. కార్మికుల్లో పలువురు ఫోన్లు పనిచేయకపోవడంతో వారి కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది. చికిత్స పొందుతున్న వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశ్రమ నుంచి ఘాటైన వాసనలు వెలువడుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రియాక్టర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగి పరిశ్రమలో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ ప్రమాదంతో స్థానికులు, కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారిని అక్కడి నుంచి దూరంగా పంపించివేసారు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సంఘటన స్థలానికి పఠాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మల్టీజోన్ టు ఐజీ సత్యనారాయణ, ఎస్పీ పరితోష్ పంకజ్ చేరుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## పాశమైలారం ఘటనపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, పటాన్‌చెరు సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో సోమవారం ఉదయం జరిగిన భారీ పేలుడు ఘటన రాష్ట్రాన్ని షాక్‌కు గురిచేసింది. ఈ ఘోర ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మంటల ధాటికి పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం విచారం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన అధికారికంగా చేసిన ప్రకటనలో.."పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనలో పలువురు మరణించడం కలచివేసింది. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఆదేశాలు సంబంధిత అధికారులకు ఇచ్చాను. ప్రభుత్వంగా మేము బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం" అని పేర్కొన్నారు.మృతుల కుటుంబాలను ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుందని, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. పాశమైలారం ఘటనపై అధికారులు సంపూర్ణ నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 10 మంది మృతి చెందగా, మరెందరో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పరిశ్రమ పూర్తిగా ధ్వంసమైన స్థితిలో ఉండగా, రెస్క్యూ చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

## కేంద్రమంత్రి అమిత్ షాపై టీపీసీసీ చీఫ్ ఫైర్



హైదరాబాద్, జూన్ 30: కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్టుల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. 'ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్టుల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసిది' అంటూ ఫైర్ అయ్యారు.శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశ పౌరులు లెఫ్ట్ ఉద్యమంలో ఉంటే వారితో సీజ్ ఫైర్ చేసి వారితో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎల్బీస్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.కాగా.. ఎల్బీ స్టేడియంలో జులై 4న ఏర్పాటు చేయనున్న సభ ఏర్పాట్లను ఈరోజు (సోమవారం) కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. జూలై 4న ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న గ్రామస్థాయి అధ్యక్షుల సమ్మేళనం సభకు ఏఐసీసీ చీఫ్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిట శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు.

## తెలంగాణ బిజెపి సారథిగా రామచంద్రరావు



హైదరాబాద్,జూన్26, తెలంగాణ భాజపా అధ్యక్షుడిగా ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఈ పదవికి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేరు ఖరారైంది. ఈ మేరకు నామినేషన్ వేయాలని పార్టీ అధిష్ఠానం ఆయన్ను ఆదేశించింది. మధ్యాహ్నం 2 గంటలకు రామచందర్‌రావు నామినేషన్ దాఖలు చేసారు. రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు ఎవరికి అప్పగించాలన్న విషయంపై భాజపా అగ్రనేతలు తీవ్ర కసరత్తు చేశారు. ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేర్లు బలంగా వినిపించాయి. ఈ క్రమంలో రామచందర్‌రావు పేరును ఖరారు చేశారు. ఆరెస్సెస్‌తో పాటు కొందరు సీనియర్ నేతలు ఆయన పేరును బలంగా ప్రతిపాదించినట్లు తెలిసింది. అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం, పార్టీని బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలను కొత్త అధ్యక్షుని ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఇకపోతే గత 40 ఏళ్లుగా పార్టీలో రామచంద్రరావు వివిధ హోదాల్లో పనిచేశారు. విద్యార్థి పరిషత్ నాయకుడిగా, లాయర్‌గా సేవలు అందించారు. ముందునుంచి పార్టీలో ఉంటూ సేవ చేసిన కారణంగా ఆయనను అధ్యక్ష పదవి వరించింది. అంతా కలిసికట్టుగా ముందుకెళ్తాం అని బిజెపి మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు తెలిపారు. బిజెపి పార్టీలో ఆధిపత్య పోరు లేదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వివాద రహితుడుగా అవకాశం ఇచ్చిందని, 40 ఏళ్లుగా పార్టీకి చేస్తున్న సేవను అధిష్టానం గుర్తించిందని తెలియజేశారు. ఇప్పటికే ఆశావాహుల్లో అనేక మంది పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు పేరును జాతీయ నాయకత్వం ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నారు. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు వెల్లడించారు. ఇక తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవికి, జాతీయ కౌన్సిల్ సభ్యుల ఎన్నికకు సంబంధించి ఆదివారం నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. బీజేపీ ఎన్నికల ఇంచార్జ్ కేంద్రమంత్రి శోభా కరండ్లజే సమక్షంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. రామచందర్‌రావు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీ నారాయణ స్వీకరించనున్నారు. పార్టీ విధేయుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు పొందిన రామచందర్ రావుకే సంఘ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. మంగళవారం రామచందర్ రావు పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఇదిలావుంటే గోషామహల్ ఎ÷-మెల్యే రాజాసింగ్ మరోమరు సంచలన ప్రకటన చేశారు. తెలంగాణలో భాజపా అధ్యక్షుడి నియామకంపై ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'రాష్ట్ర అధ్యక్షుడిగా ఒక వ్యక్తిని అధిష్ఠానం నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. అధ్యక్షుడిని బూత్ కార్యకర్త నుంచి ముఖ్య నేత వరకు ఓటేసి ఎన్నుకోవాలి. నావాడు, నీవాడు అంటూ నియమించుకుంటూ పోతే పార్టీకి తీవ్ర నష్టం. తెలంగాణలో భాజపా అధికారంలోకి రావాలంటే ఎన్నిక నిర్వహించాలి' అని రాజాసింగ్ పేర్కొన్నారు.

## బిహార్ ఎన్నికల్లో మహా కూటమితో కలిసి మజ్లిస్ పోటీ..



హైదరాబాద్: బీజేపీ, ఎన్డీఏ కూటమిని ఓడించేందుకు బిహార్ అసెంబ్లీకి ఈఏడాది చివరలో జరిగే ఎన్నికల్లో పొత్తుకు సంబంధించి మహా కూటమి(మహా ఘట్బంధన్) నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈసారిఎన్నికల్లో ఎన్డీఏను గద్దె దించే లక్ష్యంతో బిహార్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమామ్‌ప్రణాళిక రూ పొందిస్తున్నారని పేర్కొన్నారు.

బీజేపీ, ఎన్డీఏలను నియంత్రించేందుకు ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీతో కూడిన మహాకూటమితో కలిసి పోటీ చేయాలని యోచిస్తున్నట్టు వివరించారు. క్రియాశీల కార్యకర్తల బలం ఉన్న సీమాంచల్‌లో మజ్లిస్ పోటీ చేస్తోందని తెలిపారు. మహా కూటమి పార్టీలు ఎన్నికల్లో తమతో కలిసిరాని పక్షంలో బిహార్‌లోని అన్ని నియోజకవర్గాల్లో మజ్లిస్ అభ్యర్థులు పోటీ చేస్తారని ఒవైసీ స్పష్టం చేశారు.ఐదేళ్ల క్రితం బీజేపీ ఎన్డీఏను నియంత్రించేందుకు తాము తీవ్రంగా ప్రయత్నించామని గుర్తు చేశారు. బిహార్ 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరిట ఓటర్ల జాబితా సవరణ తీరుపై ఒవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీమాంచల్ లాంటి ప్రాంతాల్లో వరద ముంపుతో అక్కడి నిరుపేదల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వలస వెళ్తారన్నారు. ఓట ర్ల జాబితా సవరణ పేరిట బర్త్ సర్టిఫికెట్, నివాస ధృవీకరణతో పాటు తలిదండ్రుల నివాస ధృవీకరణ పత్రాలు చూపాలంటే నిరుపేదలు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ఆయన ప్రశ్నించారు. దీంతో వేలాది మంది నిరుపేదల పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చక పోవచ్చని, నిరుపేదలు ఓటుహక్కు పొందలేరని ఒవైసీ ఆవేదన వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ రాష్ట్రాల్లో కమిషన్ ప్రభుత్వాలు నడుస్తున్నాయి..



హైదరాబాద్,కాంగ్రెస్ రాష్ట్రాల్లో కమిషన్ ప్రభుత్వాలు నడుస్తున్నాయని కేంద్రమంత్రి శోభా కరంద్లాజే ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల అధికారిగా కేంద్రమంత్రి నియమింపబడ్డారు.ఇందుకోసం ఆమె హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయని.. అక్కడ కర్ణాటక, ఇక్కడ తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎమ్‌లా మార్చుకున్నాయని ధ్వజమెత్తారు. ఇచ్చిన గ్యారంటీలను కూడా అమలు చేసే దిక్కు లేదని ఆరోపించారు. కర్ణాటకలో ప్రభుత్వ పాలన అగమ్యగోచరంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని అడుగుతున్నాను.. తెలంగాణలో అభివృద్ధి ఎక్కడా? అని ప్రశ్నించారు. ఢిల్లీ హైకమాండ్‌కి పైసలు పంపాలి. హైకమాండ్‌ను ఖుషీ చేయాలి.. ఇదే తెలంగాణ కాంగ్రెస్ సర్కారు చేస్తున్న పని అని చెప్పారు. కర్ణాటక కాంగ్రెస్ సర్కారు కూడా ఇదే చేస్తోందని తెలిపారు.

కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో 50 శాతం కమిషన్ ప్రభుత్వాలు నడుస్తున్నాయని చెప్పారు.కార్యకర్తలు, నేతల అభీష్టం మేరకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎంపిక ఉంటుందని శోభా కరంద్లాజే తెలిపారు. ఇప్పటికే అందరి అభిప్రాయాలు తీసుకోవడం జరిగిందని మరోసారి మాట్లాడుకుంటామని చెప్పారు. మధ్యాహ్నం తర్వాత నామినేషన్ స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. ఇది పార్టీల మధ్య రాజకీయ ఎన్నిక కాదని.. పార్టీ సంస్థాగత ఎన్నిక కాబట్టి ఏకగ్రీవమే ఉంటుందని చెప్పారు. ఘర్షణ ఉండదు ఏకాభిప్రాయంతోనే ముందుకు పార్టీ వెళ్తుందని కేంద్రమంత్రి చెప్పుకొచ్చారు.ఇక సోమవారం మధ్యాహ్నం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచందర్‌రావు నామినేషన్ వేయనున్నారు. రామచందర్‌రావు బీజేపీలో చాలా కాలంగా క్రియాశీలంగా ఉన్న నేత. విద్యార్థి దశ నుంచే ఆర్ఎస్ఎస్, బీజేపీకి సంబంధించిన కార్యకలాపాల్లో భాగస్వామిగా ఉన్న ఆయన, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది కూడా. గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవంతో పాటు, పార్టీలో వివిధ స్థాయిలలో నిర్వహణలో పాల్గొన్న ఆయనకు బలమైన మద్దతు ఉంది.

## సిగాచి ఫార్మా మృతులకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి



సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన అగ్ని ప్రమాద ప్రదేశాన్ని స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఇతర నాయకులతో కలిసి మాజీ మంత్రి హరీష్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో మాట్లాడి.. అక్కడ సహాయక చర్యల గురించి తెలుసుకున్నారు.అనంతరం మాజీ మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. ఘటన జరిగి ఐదు గంటలు గడుస్తున్నా సహాయక చర్యలు, కుటుంబ సభ్యుల వివరాలు తెలుపడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ పేలుడు జరిగి 8 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు చెప్పారు.ఇంకా ఆయన మాట్లాడుతూ.. 'అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. ప్రమాదం జరిగిన సమయంలో ఫార్మా కంపెనీలో మొత్తం 140 మంది పని చేస్తున్నారు. నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలింది. 8 మంది మృతి చెందగా, దాదాపు 26 మందిని పలు ఆసుపత్రులకు. మిగిలినవారి పరిస్థితి తెలియరావడం లేదు. ఎంతమంది బయటికి రాగలిగారు అనేది అర్థం కాని పరిస్థితి. కుటుంబసభ్యులు వచ్చి ఆందోళన చెందుతున్నారు. తమవారి జాడ చెప్పాలని అధికారులను వేడుకుంటున్నారు. కుటుంబ సభ్యులకు వివరాలు తెలిపే ప్రయత్నం కలెక్టర్, ఎస్పీ గారిని కలిసి చెప్పాను.' అని అన్నారు.'ఇతర రాష్ట్రాల వారు ఇక్కడ పని చేస్తున్నారు. వారి కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.ప్రమాదం జరిగి 5 గంటలు గడుస్తున్నా, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. కంట్రోల్ రూమ్ పెట్టాలని, కామన్ ఫోన్ నంబర్ పెట్టాలని అధికారులకు సూచించాను. ప్రమాదం జరిగి 5 గంటలు అవుతున్నది. ఏం చేస్తున్నారు? వివరాలు తెలియక కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు? ప్రమాదంలో చిక్కుకున్న వారి జాడ వెతికేందుకు ఎన్డీఆర్ఎఫ్ అద్భుతంగా పని చేస్తోంది. కానీ ఇర్రెస్పాన్సిబుల్‌గా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పని చేస్తోంది. ప్రత్యేక అధికారులను పెట్టుకోండి, అటెండెన్స్ లిస్ట్ పెట్టుకోండి.' అని మాజీ మంత్రి అధికారులకు సూచించారు.'డ్యూటీలో ఎంత మంది ఉన్నారు అంటే కలెక్టర్ ఒక లెక్క, ఎస్పీ ఒక లెక్క చెబుతున్నారు. 5 గంటల నుంచి ఏ వివరాలు లేవు. బాధ్యతారాహిత్యంగా పని చేస్తోంది ఈ ప్రభుత్వం. అసలు కార్మిక శాఖ, ప్రభుత్వం ఏం చేస్తోంది. ఇక్కడకు వచ్చే కుటుంబసభ్యులు ఎవరిని కలవాలో చెప్పండి. హ్యాండ్ మైక్ పెట్టుకుని గైడ్ చేసే బాధ్యత లేదా..? గాయపడ్డ వారిని ప్రైమరీ కేర్ ఆసుపత్రుల్లో జాయిన్ చేస్తున్నారు. 30 శాతం కాలితే డేంజర్, ఆసుపత్రులకు వారిని ఎందుకు పంపడం లేదు..?

## సంపాదకీయం

మంగళవారం 01-07-2025

# జీరో డోస్!

'ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కు. దానిని నిర్లక్ష్యం చేయడమంటే రేపటి ప్రమాదాలకు పునాది వేయడమే' అంటారో ఆరోగ్యవేత్త. పిల్లలకు సమయానికి రోగ నిరోధక టీకాలు వేయించాలి. నిర్దిష్ట సమయంలో నిర్దిష్ట వ్యాక్సినేషన్ చేయించాలి. తద్వారా 20 రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లల్ని కాపాడుకోగలుగుతాం. బ్యాక్టీరియాల వల్ల కలిగే డిఫ్తీరియా, పెర్ట్యూసిస్, టెటనస్ (డిటిపి)ల నుంచి ఈ వ్యాక్సిన్ రక్షిస్తుంది. పిల్లలు పుట్టిన వెంటనే అందించే వ్యాక్సిన్లు ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడే రక్షణ కవచాలు. మన దేశంలో 1978లో ఎక్స్‌పాండెడ్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇమ్యునైజేషన్ (ఈపీఐ)గా ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని దశల వారీగా 1989–90 నాటికి దేశమంతా చేపట్టారు. ఈ వాక్సిన్లను ప్రభుత్వాసుపత్రుల్లో, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇస్తారు. చిన్నప్పుడు స్కూళ్లలో ఒక క్లాసులో టీకాలు వేస్తున్నారంటే, మరో క్లాసులో వాళ్లు పారిపోయేవారు. జ్వరమొస్తుందని తల్లిదండ్రులు కూడా భయపడేవారు. ఇంత అవగాహనా లోపం వున్నప్పటికీ మసూచి వంటి భయంకరమైన వ్యాధులను నిర్మూలించ గలిగాం. 'చిన్నారులకు ఆరోగ్య హక్కు మౌలిక హక్కే. దానిని వాయిదా వేయలేం' అంటారు నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి. భారతదేశం ఆరోగ్య రంగంలో అనేక విజయాలు సాధించినా, ఇటీవల వచ్చిన కొన్ని గణాంకాలు కలవర పెడుతున్నాయి.దేశం ఎంతో పురోగతి సాధించిందని చెప్పుకుంటున్నా14 లక్షల మందికి పైగా చిన్నారులకు ఎలాంటి టీకాలు వేయలేదని, 'జీరో డోస్' నమోదైందని ది లాన్సెట్ జనరల్ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా రోగనిరోధకత యత్నాల్లో తీవ్రమైన స్తబ్దత నెలకొందని, ముఖ్యంగా భారత్, ఇతర దక్షిణాసియా దేశాల్లో టీకాలకు దూరంగా వున్న లక్షలాది మంది చిన్నారులు ప్రాణాంతకమైన, నివారించదగిన వ్యాధుల బారిన పడే అవకాశం వుందని ఆ నివేదిక హెచ్చరించింది. 1980–2023 మధ్య వ్యాక్సిన్ అందించడంలో పురోగతి వున్నప్పటికీ 2010 నుంచి ఈ వేగం గణనీయంగా తగ్గిందని అధ్యయనం చెబుతోంది. వలస పాలనలో భారతదేశం అంటురోగాలకు పుట్టిల్లుగా వుండేది. ఆకలి చావులు, అంటువ్యాధులతో లక్షలాదిమంది మృతి చెందేవారు. ఆ స్థాయి నుంచి ఆయుఃప్రమాణాన్ని క్రమంగా పెంచుకోగలిగాం. అయితే, మోడీ అధికారంలోకి వచ్చిన ఈ 11 ఏళ్లలో దేశం అన్ని రంగాల్లో రివర్స్‌లో వెళు తోంది. ఆయుఃప్రమాణం, పేదరికం, సంతోషం, ఆకలి వంటి సూచీల్లో మనం అట్టడుగున వున్నాం. ప్రజలకు అతి ముఖ్యమైన విద్య, వైద్యం ప్రైవేటీకరించడంతో పేదలు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నారు. ఇటీవల టీవీలో కొన్ని అడ్వర్టయిజ్‌మెంట్లు తరచూ వస్తున్నాయి. భర్త ఫోటో ముందు నిలబడి'నీకే నువ్వు చచ్చిపోయి హాయిగా వున్నావు. నేను, పిల్లలే ఏడుస్తున్నాం. హెల్త్ ఇన్సూరెన్స్ అన్నా చేశావు కాదు..' అంటూ ఏడుస్తుంటుంది భార్య. ఇంకో దానిలో అనారోగ్యం నుంచి కోలుకున్న ఓ పెద్దాయన'%ఫలానా సంస్థలో ఇన్సూర్ చేయబట్టే ఇవాళ్ల నేను ఆరోగ్యంతో బయటపడ్డాను' అంటూ చిరునవ్వుతో ముక్తాయింపు ఇస్తాడు. ప్రజల్ని ఇటువంటి మైండ్‌సెట్‌లోకి తీసుకెళ్లి, వైద్యం ఒక వ్యాపారం, నీ ఇన్సూరెన్స్ నువ్వు కట్టుకో, నీ ఆరోగ్యం బాధ్యత నువ్వే చూసుకో అని ప్రభుత్వాలు చెప్తున్నాయి.వ్యాక్సిన్ మహత్తరమైన శాస్త్రీయ పరిశోధన. ప్రజల్ని గడగడ వణికించిన అనేక జబ్బులకి వ్యాక్సిన్‌లు రావడం వల్ల శిశుమరణాలను గణనీయంగా తగ్గించగలిగాం. ప్రభుత్వాలు దీన్నొక ఉద్యమంగా నడిపితేనే ఇది విజయవంతం అవుతుంది. అయితే, ప్రభుత్వం ప్రజారోగ్యం బాధ్యత నుంచి పూర్తిగా వైదొలగడం వల్లే కరోనా సమయంలో దేశం లక్షలాది చావులను చూసింది. ఒకప్పుడు వ్యాక్సిన్‌ల ఉత్పత్తిలో ప్రపంచంలోనే 60 శాతం వరకూ భారత్ ఉత్పత్తి చేసింది. దీనికి కారణం హిందుస్థాన్ యాంటిబయోటిక్స్ వంటి సంస్థలు ప్రభుత్వరంగంలో వుండటం. మోడీ వచ్చిన తర్వాత ఇటువంటి సంస్థలన్నీ మూతబడి, అనేక ప్రైవేటు సంస్థలు పుట్టుకురావడం మన కళ్ల ముందే జరిగిన కఠోర వాస్తవం. ప్రజారోగ్యం, శానిటేషన్, టీకాలు పట్ల శ్రద్ధ పెట్టడం లేదు. మరోవైపు ప్రభుత్వాసుపత్రులు నిర్వీర్యమౌతున్నాయి. ఇదే సమయంలో ప్రజారోగ్యం పట్ల శ్రద్ధ పెట్టిన చైనావ్యాక్సిన్‌ల ఉత్పత్తిలో మొదటి స్థానంలో వుంది. క్యూబా పేదరికంలో వున్నప్పటికీ ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టింది. చిన్నారులకు టీకాలు వేయడం అంటే, ఒక ప్రాణాన్నో, ఒక కుటుంబాన్నో కాపాడటం కాదు. సమాజాన్ని రక్షించడం. లాన్సెట్ నివేదిక దేశ ఆరోగ్య రంగానికి పెద్ద హెచ్చరిక.

# వాహ్.. వర్జీనియా! గోల్డెన్ లీఫ్ తో దళారులకే లాభాల పంట

జంగారెడ్డి గూడెం:ప్రపంచ వ్యాప్తంగా 50 దేశాల్లో 720 లక్షల ఎకరాల్లో పొగాకు సాగు జరుగుతోంది. ఏటా 58లక్షల టన్నుల పొగాకు దిగుబడి కాగా.. ? 81,63,623 కోట్ల టర్నోవరుతో ఈ బిజినెస్ దూసుకుపోతోంది. ఇందులో భారతదేశం వాటా ?12,40,205 కోట్లుగా ఉంది. 4.7 కోట్ల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా పొగాకును ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అంతేకాకుండా భారత ప్రభుత్వానికి 2023లో ఎక్సైజ్, జీఎస్టీ, ఇతర సెస్?లతో కలిపి ?72,788 కోట్ల ఆదాయం లభించింది. ఇందులో విదేశీ మారక ద్రవ్యం వాటా ?12,605 కోట్లు. ఇన్ని వేల కోట్ల సంపదను సృష్టిస్తోంది రైతన్నలే. ఇంతగా లాభాలు ఆర్జించి పెడుతున్న రైతన్నలకు వార్షిక ఆదాయం ఉపాధి హామీ కూలీ రోజువారీ వేతనం కంటే చాలా తక్కువ. ఇదీ గోల్డెన్ లీఫ్ రైతన్నల పొగసూరిన బతుకు.దేశవ్యాప్తంగా 10 లక్షల ఎకరాల్లో 870 మిలియన్ కిలోల పోగాకు దిగుబడి అవుతోంది. ప్రతి రైతుకు కేవలం సాగుకే ఎకరానికి ?లక్ష ఖర్చు కాగా.. సుమారు 7 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్టు అంచనాలున్నాయి. ప్రస్తుతం వచ్చే ఆదాయం ?1,82,000. అంటే కేవలం ?82,000 మిగులుతుంది. నెలకు ?6,800 ఇంటి ఖర్చులకే సరిపోతుంది. మరి ఇంట్లో పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలకు అప్పు చేయాల్సిందే. ఒకరకంగా పొగాకు రైతు బతుకు ఉపాధి కూలీ కంటే హీనంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే ఉపాధి కూలీకి రోజు వారీ వేతనం ?307. అంటే నెలవారీ లభించే వేతనం ?9,210. అంటే పొగాకు రైతుకు లభించే నెలవారీ ఆదాయం కంటే ఉపాధి కూలీ వేతనమే బెస్ట్. ఇక కౌలు రైతుల సంగతి పరిశీలిస్తే.. కనీసం కూలీనాలీ జనానికి పైసలు ఇవ్వలేని స్థితి. అందుకే, తమకు గిట్టుబాటు ధర కావాలని ఏపీ రైతులు ఆందోళనకు దిగుతున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పొగాకు రైతన్న అష్టకష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎందుకంటే, భారతదేశంలోని వాణిజ్య పంటల్లో పొగాకు ప్రముఖమైంది. ప్రత్యక్షంగా పరోక్షంగా 4.7 కోట్ల మందికి ఉపాధిని అందిస్తోంది. దేశంలోని వర్జీనియా పొగాకు ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ , కర్నాటక 99 శాతం వాటా కలిగి ఉన్నాయి.

**గోల్డెన్ లీఫ్ సాగు.. నిజంగా ఓ జూదం**

ఏపీలో వర్జీనియా పొగాకు సాగు రైతుల పాలిట జూదమే. గుంటూరు, ప్రకాశం,



నెల్లూరు, ఉభయగోదావరి, పల్నాడు, కర్నూలు, కృష్ణా జిల్లాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు. ఒక ఏడాది లాభాలు పండితే.. మరో ఏడాది నష్టాలు కుదేలు చేస్తాయి. లాభాల రైతుల కథలతో.. కౌలు రైతులు కూడా భారీ సంఖ్యలో బరిలోకి దిగుతారు. సిండికేటు వలలో చిక్కుకుని .. గిట్టుబాటు ధర ఏమో కానీ, కనీసం పెట్టుబడి కూడా దక్కని స్థితి నెలకొంటోంది. 2023–24లో అత్యధిక లాభాలు వస్తే.. 2024–25 లో కనీసం కూలీలకు డబ్బులివ్వలేని స్థితితో పొగాకు రైతులు బావురుమన్నారు. ఇక రాబోయే సీజన్‌లో అంటే 2025–26లో ఏకంగా సాగు విస్తీర్ణాన్ని పొగాకు బోర్డు కుదించేసింది.

**దిగుబడి పెరిగినా లాభాల్లేవ్?..**

దిగుబడి పెరగటంతో మార్కెట్టులో ధర లభించటం లేదనేది పొగాకు బోర్డు వివరణ. ఆంధ్రప్రదేశ్‌లో 2023–24 పంట కాలంలో 43,125 మంది రైతులు 97,127 హెక్టార్లలో 39,346 బ్యారన్లలో వర్జీనియా పొగాకును సాగు చేశారు. సాగు దిగుబడి లక్ష్యం 142 మిలియన్ కిలోలు కాగా.. ?6,313 కోట్లు విలువ చేసే 215.35 మిలియన్ కిలోల ఉత్పత్తి జరిగినట్టు పొగాకు బోర్డు సమాచారం. ఈ సీజన్‌లో రైతులకు సగటు కిలో వర్జీనియా పొగాకు ధర ?288.65 పలికింది. గత ఏడాది సగటు ధర కిలోకు ?225.73 నుంచి ?62.62 పెరిగింది. ఈ

# పవర్ కోసం బిజెపి పవన మార్గం



అమరావతి,తమిళనాడు రాజకీయ రంగస్థలం నటులతో కిటకిటలాడుతున్నది. తెలుగు రాజకీయాల మీద సినీ నటుల ప్రభావమూ, పెత్తనమూ మొదలయింది 1982లో మహానటుడు ఎన్‌టి రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టాకనే అయినా తమిళనాడులో మాత్రం రాజకీయాలను సినిమావాళ్ళు శాసించడం నేడు కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రానికి అయిదవ ముఖ్యమంత్రిగా, తమిళనాడు తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన తమిళుల ఆరాధ్య నాయకుడు అన్నాదురై మొదలుకొని నేడు ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న డిఎంకె ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి వరకూ అధికారంలో, ప్రతిపక్షంలో ఉన్న సినిమావాళు ్ళ ఎందరో. ఉదయనిధి స్టాలిన్ ఇప్పటివరకు అనేక సినిమాల్లో నటించి, నిర్మించారు. తమిళనాడు వెలుపల చాలామందికి తెలియకపోయినా, ఆయన తండ్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ కూడా యువకుడుగా ఉన్నప్పుడు కొన్ని సినిమాల్లో నటించారు.భారత సినీ పరిశ్రమలో అత్యుత్తమ నటుల్లో ఒకరిగా పేరుపొందిన కమల్ హాసన్ నటుడిగా కొనసాగుతూనే ఎం.ఎన్.ఎమ్ (మక్కల్ నీది మయ్యమ్) పేరిట పార్టీ పెట్టి, రాజకీయాల్లో తన ఉనికిని కొనసాగిస్తున్నారు. ఆయన ఇటీవల రాజ్యసభకు నామినేట్ కూడా అయ్యారు. ప్రస్తుత తరం మాస్ హీరోల్లో ఒకరైన నటుడు విజయ్ జోసఫ్, ఇండస్ట్రీలో తనకు ముందున్నవారిని అనుసరిస్తూ తన రాజకీయ పార్టీ టివికె (తమిళగ వెట్రి కజగం)ని స్థాపించారు. వీరంతా వచ్చే ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ప్రారంభంలోనే చెప్పుకున్నట్టు తమిళ సినిమా, రాజకీయాలు విడదీయలేనివి. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి తమిళనాడు ముఖ్యమంత్రుల్లో ఎక్కువమంది రాజకీయ నేపథ్యం కంటే సినిమారంగం నుండి వచ్చినవారే ఎక్కువ.ఇప్పుడు, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఒక ప్రముఖ నటుడు ఈ జాబితాలో చేరారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ తమిళనాడు ఎన్నికల్లో పోటీ చేయకపోయినా, బిజెపి, దాని మిత్రపక్షాల తరపున ప్రచారం నిర్వహించనున్నారు. సరదాగా చెప్పాలంటే, బిజెపికి ఇప్పుడు ఇతర పార్టీలలోని స్టార్‌లను ఎదుర్కొనే 'స్టార్' క్యాంపెయినర్ దొరికాడు.గత కొన్ని సంవత్సరాలుగా పవన్ కళ్యాణ్ హిందూత్వ భావజాలానికి ప్రతినిధిగా మారిపోయారు. ఆలయాల పరిపాలన, ధర్మాదాయ శాఖల విధానాల్లో మార్పుల కోసం కృషి చేస్తూ, హిందూ మతానికి సంబంధించిన అంశాలపై బలంగా అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ ఇటీవలికాలంలో ఆంధ్రప్రదేశ్‌లో కంటే తమిళనాడులోనే ఎక్కువ రాజకీయాలు చేస్తున్నట్టున్నారు. తాను ఉప ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో ఆయన ఎప్పుడైనా మాట్లాడాల్సివస్తే మరో 20 సంవత్సరాలపాటు కూటమి అధికారంలో ఉంటుందని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉంటారని, అందుకు ఆయనే సమర్థుడని ప్రకటిస్తుంటారు.తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడంకోసం ఆయన పడుతున్న తపన అందరూ చూస్తున్నారు. నాలుగు రోజులనాడు ఆయన 'మురుగ భక్తర్గళ్ మానాడు' అనే ఒక ఆధ్యాత్మిక సమ్మేళనానికి అతిథిగా హాజరయ్యారు. సభకు హిందూ ధార్మిక గురువులు, భారతీయ జనతా పార్టీ నాయకులతోపాటు జనం కూడా పెద్ద సంఖ్యలోనే హాజరయ్యారు.భగత్ సింగ్ భక్తుడిగా, చేగువేరా శిష్యుడిగా మొదలయిన పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం ఎన్నికల్లో కమ్యూనిస్టులతో చెట్టపట్టాలు వేసుకొని తిరిగిన తరువాత హఠాత్తుగా సనాతన హిందూమార్గం పట్టింది. భారతీయ జనతా పార్టీ మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా పనిచేసే ఒక మత సంస్థ ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనంలో పవన్ కళ్యాణ్ ప్రసంగం అంతా ఒక నికార్సైన సనాతన హిందూవాదిగానే సాగింది.తమిళనాడులో 2026 ఏప్రిల్ లో శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉన్నది. ఇప్పటివరకు అక్కడ అధికారంలోకి వచ్చినవి ప్రధానపక్షాలైన డిఎంకె లేదా ఎఐఎడిఎంకె మాత్రమే. అయితే ఒక విశేషం ఏమిటంటే ఈ రెండు పార్టీలుప్రతిసారి అక్కడ అధికారంలోకి వచ్చింది ఇతర పార్టీలతో కలిసి కూటమిగానే. ఒంటరిగా ఎప్పుడూ పోటీ చేసి గెలిచింది లేదు. ఎఐఎడిఎంకె మాత్రం ఒక్కసారి ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి వచ్చినట్టుంది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్ లేదా భారతీయ జనతా పార్టీ.. ఈ రెండు ప్రధాన ద్రవిడ పార్టీలు ఏదో ఒక పార్టీతో కలిసి కూటమిలో కొనసాగుతూ ఉంటాయి. ప్రస్తుతం తమిళనాడులో అధికారంలో ఉన్న డిఎంకె ఇండియా కూటమిలో భాగస్వామి. బిజెపికి బద్ధ వ్యతిరేకి. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చేస్తున్న పలు నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఉన్నది కూడా. అందువల్ల ఇప్పుడు భారతీయ జనతా పార్టీ దక్షిణాదిలో బలోపేతం కావడంకోసం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా నటుడు కూడా అయిన పవన్ కళ్యాణ్‌ను తమిళనాడుకు తరచూ పంపుతున్నది. ఆయన తమిళనాడు పర్యటనల్లో జాతీయ విద్యావిధానం విషయంలో అధికారపక్షం డిఎంకె తీసుకున్న వైఖరిని వ్యతిరేకించడం, 'ఒకే దేశం– ఒకే ఎన్నిక' అన్న బిజెపి విధానాన్ని బలంగా ప్రచారంలో పెట్టడం, సనాతనధర్మ ప్రచారాన్ని ముందుకు తీసుకుపోవడం ద్వారా బిజెపిని ఆ రాష్ట్రంలో బలోపేతం చేసేందుకు ఆ పార్టీ నాయకుల కంటే ఎక్కువ శ్రమ పడుతున్నట్టున్నాడు.భారతీయ జనతా పార్టీ దక్షిణాదిలో కర్ణాటక తప్ప ఇటీవలి దాకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో గానీ ఎప్పుడూ అధికారంలోకి వచ్చింది లేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2014లో ఒకసారి, మళ్లీ ఇప్పుడు కూటమిలో భాగంగా అధికారంలో ఉన్నా ప్రధాన భాగస్వామి తెలుగుదేశం పార్టీయే. ఇక వామపక్షాలు బలంగా ఉన్న కేరళ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రయత్నాలు పెద్దగా సఫలం కావడం లేదు. అందుకోసమే కాంగ్రెస్ పార్టీలో అత్యంత వివాదాస్పదుడైన పార్లమెంట్ సభ్యుడు శశిథరూర్‌ను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు అర్థం అవుతున్నది. ఇటీవల పహల్గాం ఘటన అనంతరం భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య జరిగిన పరిణామాలను వివరించి మద్దతు కూడగట్టేందుకు ఇతర దేశాలకు పంపిన ప్రతినిధి బృందాల్లో శశిథరూర్‌ను చేర్చడం, ఆ పర్యటననుంచి వచ్చాక ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోడీని పొగడ్తలతో ఆకాశానికి ఎత్తడం సందేహాలకు తావిస్తున్నది.ఇక మళ్ళీ పవన్ కళ్యాణ్ విషయానికి వస్తే, ఆయన కాషాయ వస్త్రధారణలో కనిపించి, తన మతవిశ్వాసాలను బహిరంగంగా ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో, తమిళనాడువంటి రాష్ట్రాల్లోకి ప్రవేశించేందుకు పవన్ కళ్యాణ్ దక్షిణ భారతంలో తమ ప్రతినిధి అవుతాడని బిజెపి ఆశలు పెట్టుకున్నట్టుగా కనిపిస్తున్నది. అంతేకాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సరిహద్దులను పంచుకుంటున్నాయి. స్వాతంత్ర్యానంతరం కొంతకాలం వరకు ఆంధ్రప్రదేశ్ మద్రాస్ ప్రెసిడెన్సీలో భాగంగా ఉండేది. దశాబ్దాలుగా తమిళనాడులో స్థిరపడిన తెలుగు జనాభాను పవన్ కళ్యాణ్ ఆకర్షించే అవకాశం ఉంది. పవన్ కళ్యాణ్ తన బాల్యాన్ని చెన్నైలో గడిపారు. ఎందుకంటే అప్పట్లో తెలుగు సినిమా ఇండస్ట్రీ అక్కడే ఉండేది. ఆయన అన్నయ్య చిరంజీవి కూడా అక్కడే నివాసం ఉండేవారు. అందువల్ల తమిళనాడులోని ఇతర రాష్ట్రాల స్టార్ క్యాంపెయినర్‌లతో పోల్చితే, పవన్ కళ్యాణ్‌కు తమిళ భాషతో పరిచయం ఉండటం అదనంగా కలిసొచ్చే అంశం.ఇటీవల పవన్ కళ్యాణ్ మధురైలో హాజరయిన మురుగ భక్తుల మహాసభ.. ఆయన తమిళనాడు పర్యటనలలో మొదటిదేమీ కాదు. తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తూ చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా పవన్ కళ్యాణ్ తిరుపతిలో సభ పెట్టి తీవ్రమైన విమర్శలు చేశారు. ఉదయనిధి పేరు ప్రత్యక్షంగా ప్రస్తావించకపోయినా సనాతన ధర్మాన్ని ఎవరూ నిర్మూలించలేరు అని కౌంటర్ ఇచ్చారు.ఈ సంవత్సరం మొదట్లో పవన్ కళ్యాణ్ తమిళనాడు, కేరళలలో పలు ఆలయాలను సందర్శిస్తూ 'సనాతన ధర్మాన్ని రక్షించేందుకు ప్రత్యేకబోర్డు కావాలి' అంటూ ప్రచారం చేశారు. ఈ పర్యటనకు 'సనాతన ధర్మ యాత్ర' అని పేరు కూడా పెట్టారు. ఆయన్ని కాషాయ వస్త్రధారణలో జనం ఈ రెండు రాష్ట్రాల్లో ప్రతి చోటా చూశారు. బిజెపి ప్రభావం తక్కువగా ఉన్న ఈ రాష్ట్రాల్లో అడుగు పెట్టేందుకు ఇది ఆయన చేసిన ప్రయత్నంగా భావించాలి . ప్రముఖ విశ్లేషకుడు, 'తుగ్లక్' తమిళ పత్రిక సంపాదకుడు ఎస్. గురుమూర్తి ఒక టివి ఇంటర్వ్యూలో చెప్పినట్టు పవన్ తమిళనాడులో అత్యధికంగా ఉన్న తెలుగు జనాభాను బిజెపి వైపు ఆకర్షించడానికి తన సందేశాన్ని బలంగా వినిపించగలడేమో చూడాలి.తాజాగా జరిగిన మధురై పర్యటనలో ఆయన తన మతపరమైన విశ్వాసాలపై, తమిళనాడుతో ఉన్న అనుబంధంపై ప్రసంగించారు. తన చిన్నతనంలో శబరిమల వెళ్లిన విషయాన్ని, నుదిటిపై విభూతి రాసుకుని స్కూలుకు వెళ్లిన విషయాలను చెప్పారు. తమిళనాడు సంస్కృతిపై తనకున్న గౌరవాన్ని వ్యక్తం చేశారు. మధురై ఆలయాన్ని 14వ శతాబ్దంలో మాలిక్ కఫూర్ ఎలా ధ్వంసం చేశారు.

# అమృత్ స్కీమ్ కింద తాగునీరు పైప్‌లైన్ పనులు

అమరావతి,అమృత్ స్కీమ్ కింద తాగునీరు పైప్‌లైన్ పనులకు టెండర్లు పిలిచామని సీఎం చంద్రబాబు తెలిపారు.వారంలో రూ.5,350 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలుస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. గుంటూరు, విశాఖపట్నంలో చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్, పురపాలక శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉండవల్లి నివాసంలో సమీక్షకు మంత్రి నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. నెల్లూరు, రాజమండ్రి ప్లాంట్లకు టెండర్లు పూర్తి అయ్యాయని చెప్పారు. కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతి ఎ÷–లాంట్లకు త్వరలో టెండర్లు పిలుస్తామని అన్నారు. మున్సిపాలిటీల్లో ఆధునిక యంత్రాల కొనుగోలుకు రూ.225 కోట్లు కేటాయించామని తెలిపారు. వీలైనంత త్వరగా లబ్దిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. మున్సిపల్ శాఖలో అనేక అంశాలపై సీఎం చంద్రబాబుతో చర్చించామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మీడియాకు మంత్రి నారాయణ తెలిపారు. టిడ్కో ఇళ్లను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల కోసం 2014 నుంచి 2019 మధ్య కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక నిధులను తీసుకువచ్చామని వెల్లడించారు మంత్రి నారాయణ. రూ.5800 కోట్లు నిధులు, రూ.3000 కోట్ల స్వచ్ఛభారత్ నిధులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిందని మంత్రి నారాయణ గుర్తుచేశారు. గత జగన్ ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో మధ్యలోనే నిధులు నిలిచిపోయాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులను పరిష్కరించి కేందప్రభుత్వం నుంచి మళ్లీ నిధులు తీసుకువస్తున్నామని వివరించారు. అమృత్ స్కీమ్ ద్వారా తాగునీరు పైప్‌లైన్ పనుల కోసం నిన్ననే టెండర్లు పిలిచామని స్పష్టం చేశారు. ఈ పనులు పూర్తయితే 85 శాతం ప్రతి ఇంటికీ నేరుగా నదులు, కాలువల ద్వారా నీరు అందుతోందని అన్నారు. ంఎఎః నుంచి రూ.5350 కోట్లకు సంబంధించిన పనులకు వారం రోజుల్లో టెండర్లు పిలుస్తామని తెలిపారు మంత్రి నారాయణ. యా నిధులకు రాష్ట్ర వాటా ఇచ్చేలా ఆర్థిక శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని మంత్రి నారాయణ తెలిపారు. శుద్ధి చేసిన నీటిని డ్రైన్లలోకి వదిలేలా 2029లోగా వందశాతం ఃఖలు నిర్మిస్తామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం వదిలేసిన లెగసీ వేస్ట్‌ను అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తిగా తొలగిస్తామని చెప్పుకొచ్చారు. 2014 నుంచి 2019 మధ్యలో 10 వేస్ట్ టు ఎనర్జీ ఎ÷–లాంట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు. ప్రస్తుతం గుంటూరు, విశాఖపట్నం ప్లాంట్‌లలో 2800 టన్నుల చెత్త నుంచి విద్యుత్ తయారు చేస్తున్నారని మంత్రి నారాయణ చెప్పారు. నెల్లూరు, రాజమండ్రిప్లాంట్‌లకు టెండర్లు పూర్తి అయ్యాయని మంత్రి నారాయణ వెల్లడించారు. కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతిలో ఎ÷–లాంట్‌ల ఏర్పాటుకు త్వరలో టెండర్లు పిలుస్తామని అన్నారు. ఈ ఎ÷–లాంట్‌లు పూర్తయితే 7500 టన్నుల చెత్తని ప్రతిరోజూ విద్యుత్ తయారీకి పంపిస్తున్నామని తెలిపారు. మిగిలిన 500 టన్నుల చెత్తను వివిధ రూపాల్లో సేకరిస్తామని చెప్పారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ కోసం కంపాక్టర్లు, స్వీపింగ్ మెషీన్ల కొనుగోలు కోసం రూ.225 కోట్లు కేటాయించామని ప్రకటించారు. అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మెపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల కోసం 2014–19 మధ్య కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చామని గుర్తు చేశారు. రూ.5,800 కోట్ల ఏఐఐబీ నిధులు, రూ.300 కోట్ల స్వచ్ఛభారత్ నిధులకు ఆమోదం వచ్చిందని వెల్లడించారు. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో మధ్యలోనే నిధులు నిలిచిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సమస్యలు పరిష్కరించి మళ్లీ నిధులు తీసుకొస్తున్నామన్నారు. అమృత్ స్కీమ్ ద్వారా తాగునీటి పైప్‌లైన్ పనుల కోసం నిన్న టెండర్లు పిలిచామని తెలిపారు.

# రోదసీ యాత్ర నవశకానికి నాంది...

న్యూఢిల్లీ,శుభాంశు శుక్లా అంతరిక్ష ప్రయాణాన్ని.. భారత మానవసహిత యాత్ర 'గగన్‌యాన్'కు తొలి అడుగుగా ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శుక్లా చరిత్రాత్మక యాత్ర కేవలం రోదసికే పరిమితం కాలేదని, వికసిత్ భారత్ వైపు సాగుతున్న ప్రయాణానికి కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం లో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతో ప్రధాని మోదీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా 'భారత్ మాతా కీ జై' నినాదాలతో 'ఐఎస్ఎస్' మార్మోగింది. 'మిషన్‌లో భాగంగా మీరు ప్రస్తుతం భారత్‌కు చాలా దూరంగా ఉన్నప్పటికీ.. దేశవాసుల హృదయానికి దగ్గరగా ఉన్నారు. మీ రోదసి ప్రయాణం నవ శకానికి నాంది. అంతరిక్షాన్ని అన్వేషించాలనే విద్యార్థుల సంకల్పాన్ని ఇది మరింత బలోపేతం చేస్తుంది' అని శుభాంశును ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే శుభాంశు స్పందిస్తూ.. ఇదంతా తానొక్కడి ఘనత కాదని, యావత్ దేశం సమష్టి విజయమని చెప్పారు. 'భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉంది. ఇక్కడినుంచి మొదటిసారి మన దేశాన్ని చూసినప్పుడు.. అది మ్యాప్‌లో కంటే చాలా పెద్దదిగా, గొప్పగా కనిపించింది. ఈ భూమి అంతా మన నివాసంగా, మనమంతా దాని సభ్యులుగా అనిపిస్తోంది. సరిహద్దులు, విభజన రేఖలు లేని ఏకత్వ భావన కలుగుతోంది' అని అన్నారు. యాక్సియం–4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్–9 రాకెట్ ద్వారా భారత్‌కు చెందిన శుభాంశు శుక్లా సహా పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ –విస్నీవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)లు అంతరిక్షంలోకి వెళ్లారు. భారత కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు అమెరికాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరిన వీరి వ్యోమనౌక.. గురువారం సాయంత్రం 'ఐఎస్ఎస్'కు చేరుకుంది. డాకింగ్ అనంతరం వీరంతా అందులోకి ప్రవేశించారు. ఈ మిషన్‌లో భాగంగా 14 రోజులపాటు అక్కడే గడపనున్నారు.

# జైన అత్యున్నత మండలి నిర్ణయం

న్యూఢిల్లీ,విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన సభ నేపథ్యంలోనే జైన అత్యున్నత మండలి ప్రధాని మోడీకి ధర్మ చక్రవర్తి పురస్కారం అందించారు. ధర్మనిబద్ధతత పాటించే పాలకులకు , ధర్మ పరిరక్షణ సంకల్పం కల్గిన వారికి ఈ బిరుదు ప్రసాదించడం జరుగుతుంది. ఈ విశిష్ట పురస్కారానికి తాను అర్హుడినని తాను భావించడం లేదని, అయితే సాధువులు బహుకరించే వాటిని దివ్య ప్రసాదంగా స్వీకరించడం భారతీయ సంస్కృతి, ఈ క్రమంలోనే ఈ గౌరవాన్ని తాను ప్రసాదంగా తీసుకుంటున్నానని తెలిపారు. జైన సాధు మహారాజు జయంతి ఉత్సవాలను కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, భగవాన్ మహావీర్ అహింసా భారతి ట్రస్టు సంయుక్తంగా నిర్వహించాయి.

# కాంగ్రెస్ పాలనతోనే దేశం సుభిక్షం

కాకినాడ,దేశంలో ప్రజలు సుభిక్షంగా, సంతోషాలతో ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ పాలన చాలా అవసరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికార కూటమిలోని పార్టీలైన టీడీపీ, జనసేనతో పాటు ప్రతిపక్ష వైసీపీ కూడా రాష్ట్రానికి విభజన హామీలను అమలు చేయకుండా అన్యాయం చేసిన బీజేపీకి తొత్తులుగానే వ్యవహరిస్తున్నాయని షర్మిల పేర్కొన్నారు. శనివారం కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో పార్టీ బలోపేతంపై సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలను వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం నిమిత్తం తాను రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేస్తున్నానని అందులో భాగంగా కాకినాడకు వచ్చానన్నారు. నాడు చంద్రబాబు, నేడు కూటమి ద్వారా బీజేపీకి పూర్తి మద్దతు ఇచ్చి రాష్ట్రానికి రావాల్సిన అన్ని హామీలను గాలికి వదిలేసారన్నారు. అలాగే అంతకుముందు జగన్ మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పి స్వార్థం కోసం బీజేపీకి తొత్తుగా వ్యవహరించి రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. దివంగత సీఎం వైఎస్ ఏనాడు బీజేపీకి అనువుగా వ్యవహరించలేదని జగన్ అలా వ్యవహరించి వైయస్ పరువు తీసారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లుగా హోదా ఇచ్చినట్టుగా, హామీలు అమలు చేసిననట్లుగా, పోలవరం ప్రాజెక్టు నిర్మించినట్లుగా, అమరావతి పూర్తి చేసినట్లుగా బాబు, పవన్ ఊహించుకుంటున్నారేమోనని ఎద్దేవా అన్నారు. రాజధానికి నిధులు ఇవ్వకుండా అప్పులు ఇస్తున్నారని, విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేట్ పరం చేయనని ఇంతవరకు ప్రధాని మోడీ చెప్పలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా అమలు చేయలేకపోతున్నారని రాష్ట్రంలో తల్లికి వందనం సంబంధించి 87 లక్షల మంది అర్హులు ఉంటే 60 లక్షల మందికి మాత్రమే ఇచ్చారన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, మహిళా శక్తి పేరుతో 18వేలు ఇచ్చే పథకం కూడా ఇంకా ప్రారంభించలేదన్నారు. ఉచిత బస్సు హామీకి తక్కువ బ్జడెట్ అవుతుందని అయినా దాన్ని అమలు చేయలేదని ఈ పథకం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో( చాలా బాగా అమలవుతుందని షర్మిల చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45 మీటర్లు కడితేనే అది పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తుందని నిపుణులు చెబుతున్నా కేంద్ర మాత్రం 41 మీటర్లు కడితేనే నిధులు ఇస్తామని చెప్పిన అంశాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ విషయంపై పార్లమెంటులో ఏ ఒక్క ఎంపీ కూడా మాట్లాడకపోవడం గమనార్హమన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్ విద్యుత్ చార్జీల భారం ప్రజలపై 32 వేల కోట్లు వేస్తే గడిచిన ఒక ఏడాదిలో కూటమి ప్రభుత్వం 17వేల కోట్ల రూపాయల భారాలను మోపిందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇంతటి అన్యాయం చేస్తున్న పాలక కూటమి పార్టీలు, ప్రతిపక్ష వైసీపీ ఇంకా వారికి విధానాలకు మద్దతిచ్చి తొత్తులుగా వ్యవహరించడం తగదని షర్మిల ధ్వజమెత్తారు. అనంతరం కార్యక్రమంలో కార్యకర్తల సమస్యలు వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు, జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం, నాయకులు కామన ప్రభాక ర్ రావు, చెక్క నూకరాజు, నీరుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి కవిజ్ఞాన కేంద్రంలో కమ్యూనిటీ కిచెన్

విశాఖపట్టణం,అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ కిచెన్ ను విజ్ఞాన కేంద్రం చైర్మన్ సిహెచ్.నరసింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ కిచెన్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగే విద్యా, వైజ్ఞానిక, సామాజిక, సాంస్కృతిక, మేధో, పరిశోధనా కార్యక్రమాలకు ఎంతో తోడ్పాటు నిస్తుందని అన్నారు. అలాగే ఈ కేంద్రం నిరంతరం బాలోత్సవాలు, బాలల్లో శాస్త్రీయ దృక్పథం కలిగించే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. కంప్యూటర్ స్కిల్ డెవలప్మెంట్, టైలరింగ్ , ట్యూషన్ సెంటర్లు, పోటీ పరీక్షలకు శిక్షణ, మెడికల్ క్యాంపులు వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. అనతి కాలంలోనే విశాఖ నగరంలో ఎంతో పేరు గడిచిందని కొనియాడారు. తాజాగా విజ్ఞాన కేంద్రంలో కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయడం ఎంతో మందికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ కిచెన్ కి కుక్కర్లు, వంట స్టవ్వులు, పాత్రలు ఇచ్చిన రామారావుని అభినందించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం సెక్రటరీ డా, బి గంగారావు, ట్రస్టీ ఎం జగ్గునాయుడు, ట్రస్ట్ నిర్వాకులు ఎం ఆర్ డి రాజు, విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వాహకులు జిఎస్ రాజేశ్వరరావు, దండు నాగేశ్వరావు, బుజ్జి, కామేశ్వరరావు, కొండప్ప తదితర లు పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా సాగుతాయా?

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయి. ఓ వంక ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు దుమారం రేపుతుంటే.. మరో వంక గత బీఆర్ఎస్ ప్రభుత్వ, 'ఘన' చరిత్రకు అద్దం పట్టే, ప్రతిష్టాత్మక' కాళేశ్వరం ప్రాజెక్ట్, ఫార్ములా – ఈ కార్ రేస్ ఇతరత్రా అవినీతి కేసులు, రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. ఏ రోజుకు ఆరోజు కొత్త మలుపులు తీసుకుంటు న్నాయి. అదొకటి అలా ఉంటే.. అన్ని పార్టీలకూ, మరీ ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీకి అగ్ని పరీక్ష కానున్న స్థానిక సంస్థల ఎన్నికలు తరుము కొస్తున్నాయి. 2019లో ఎన్నికల్లో కొలువు తీరిన స్థానిక సంస్థలు కాలం చేసి, సంవత్సరం పైగానే అయినది. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇదిగో అదిగో అంటూ.. స్థానిక ఎన్నికలను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చింది. అయితే.. ఇక ఇప్పుడు తప్పించుకునే అవకాశం లేకుండా రాష్ట్ర హై కోర్టు ఎన్నికలను పదేపదే వాయిదా వేయడాన్ని తప్పుపడుతూ, సర్కార్ నెత్తిన అక్షితలు వేయడంతో పాటుగా , 90 రోజుల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించి తీరాలని ప్రభుత్వానికి గడవు విధించిది. ఈ నేపధ్యంలో ఇప్పుడు ప్రభుత్వానికి ఎన్నికలు నిర్వహించడం మినహా మరో మార్గం లేకుండా పోయింది. రాష్ట్ర హై కోర్టు విధించిన 90 రోజుల గడువు ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించక తప్పని పరిస్థితి ఏర్పడింది. మరో వంక ఎటు తేలని బీసీ రిజర్వేషన్ వ్యవహారం, సర్కార్ కు తలనొప్పిగా మారింది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు అన్నీ కలిపి 50 శాతం మించకూడదని సుప్రీం కోర్టు తీర్పు ఉన్నది. ఈ పీటముడిని విప్పితేగానీ ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగే పరిస్థితి లేదు. అయితే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మనసులో ఏముందో ఏమో కానీ.. ఈరోజుకు కూడా రిజర్వేషన్లపై ఎటూ తేల్చకుండా నాన్చివేత ధోరణి అవలబిస్తోంది. అదలా ఉంటే 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని, లేదంటే.. అంటూ బీసీ సంఘాలు హెచ్చరిస్తు న్నాయి. ఇలా ఎటు చూస్తే అటు పటు నిరాశ అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వం చిక్కుల్లో చిక్కుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటు న్నారు.అదొకటి అయితే.. ఏదో ఒకటి చేసి, కోర్టు ఆదేశాల ప్రకారం, 90 రోజుల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించినా.. ఫలితాలు ఎలా ఉంటాయి.

# మోదీ మంత్రం.. స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందా?

న్యూఢిల్లీ,తెలంగాణలో బీజేపీ టార్గెట లోకల్ బాడీ ఎనికలేనా..ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాధించిన విజయం ఇచ్చిన జోష్ పార్టీ శ్రేణుల్లో ఏమాత్రం తగ్గకుండా అధిష్ఠానం ప్రణాళికలు రచిస్తోందా..? మోడీ 11 ఏళ్ల పాలన, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు రాష్ట్ర ప్రజలపై ఇంపాక్ట్ పడే విధంగా స్కెచ్ వేస్తోందా.ఇదే జోష్, ఇదే ఉ త్సాహంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా పార్టీ శ్రేణుల్లో కాన్ఫిడెన్స్ నింపేందుకు పార్టీ పెద్దలు కసరత్తులు చేస్తున్నారా.అసలు బీజేపీ పెద్దల స్కెచ్ ఏంటి?

స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ ఫోకస్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంతో ఫుల్ జోష్ లో ఉన్న కాషాయ దండు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను టార్గెట్ చేస్తోంది. చాప కింద నీరులా కనపడకుండానే బలోపేతం అవుతున్న పరివారులు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు పాచికలు కదుపుతున్నారు. బీఆర్ఎస్ పాచికలను తిప్పికొడుతూ, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ, తమ గళాన్ని ప్రజల్లో వినిపించడానికి కాషాయ దళం సిద్ధం అవుతోంది. బీఆర్ఎస్ చేస్తున్న ఫామ్ హౌస్ రాజకీయాలు తమకు ప్లస్ అవుతున్నాయనే అంచనాల్లో బీజేపీ ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ .. మరోవైపు బిజెపి, బీఆర్ఎస్ కలిసి ఒప్పందం ప్రకారమే హోల్ సేల్ రాజకీయాలు చేస్తున్నాయనే టాక్ సైతం నడుస్తోంది. అంతేకాదు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ ఒప్పందం ప్రకారమే రెండు పార్టీలు కలిసి నీకు సగం సీట్లు, నాకు సగం సీట్లు అంటూ ముందుకు వెళ్తాయనే టాక్ సైతం రాజకీయ వర్గాల్లో నడుస్తోంది.

ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగిందని కాన్ఫిడెన్స్

గత అసెంబ్లీ ఎన్నికల్లో అనుకున్న లక్ష్యాలకు భారీగా గండి పడి, అధికారమనే కల నెరవేరకపోయినప్పటికీ, ఓటింగ్ శాతం భారీగా పెంచుకున్నామని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తమదే అధికారమనే కాన్ఫిడెన్స్ కమలనాథుల్లో కనిపిస్తోంది. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కారు, కమలం పార్టీల కుమ్మక్కు రాజకీయం మంచి ఫలితాలను రాబట్టడంతో, వచ్చే స్థానిక ఎన్నికల్లో కూడా ఇదే స్ట్రాటజీ తో ముందుకు వెళ్ళి, అధికార పార్టీకి భారీగానే గండి కొట్టాలనే టార్గెట్ పెట్టుకున్నట్టు తెలుస్తోంది. అందుకు బీజేపీ ఇప్పటి నుంచే స్థానిక ఎన్నికలకు దారులన్నీ క్లియర్ చేసుకుంటోంది.

రాష్ట్ర నేతలకు సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ క్లాసులు

అందులో భాగంగానే, 11 ఏళ్ల మోడీ పాలన, మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇస్తున్న నిధులు, పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో రాష్ట్ర బీజేపీ నేతలు విఫలమవుతున్నారని పార్టీ అధిష్టానం భావిస్తోందంట. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యంపై ప్రజలకు వివరించడంలో బీజేపీ విఫలం అవుతుందనే టాక్ వినిపిస్తున్న నేపద్యంలో కాషాయ శ్రేణులకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి సునీల్ బన్సల్, పొలిటికల్ వ్యవహారాల ఇంచార్జీ అభయ్ పాటిల్ కలిసి పార్టీ క్యాడర్‌కు క్లాస్‌లు పీకుతూ వారిని అలెర్ట్ చేసే పనిలో బిజీగా గడుపుతున్నారంట.

ఎమ్మెల్సీ ఎన్నికలు అడ్వాంటేజ్ అవుతాయని ధీమా

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు యావత్ తెలంగాణ రాజకీయాలపై ప్రభావం చూపే




అవకాశముందా, లేదా..? అనేది అటుంచితే.. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తమకు అడ్వాంటేజిగా మారాయని తెలంగాణ కమలదళం భావిస్తోంది.. ఈ అడ్వాంటేజీ ఉత్తర తెలంగాణ జిల్లాలపై మాత్రమే ఉండనుందా..? వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉత్తర తెలంగాణపై బీజేపీపట్టు పెంచుకుంటుందా..? ఇప్పటికే ఉత్తర తెలంగాణ నుంచి నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండటం ఆ పార్టీ ప్లస్ అవుతుందా అన్న చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికల ఫలితాలను పూర్తిగా అనుకూలంగా మార్చుకుని తెలంగాణలో అధికారం సాధించడానికి బీజేపీ హైకమాండ్ పాచికలు వేస్తూ, సైలెంట్ గా పావులు కదుపుతోందంటున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడానికి ప్రణాళికలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో ఫుల్ జోష్ తో ఉన్న పరివారుల దండు ఇదే జోష్‌తో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటాలని ప్రణాళికలకు పదును పెడుతోంది. రాష్ట్రంలో అధికార మార్పు జరిగి, ఏడాదిన్నర పూర్తైన నేపద్యంలో.. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ ఎన్నికలొచ్చినా విజయం తమదే అని ధీమా వ్యక్తం చేస్తున్న కాషాయ పారీఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి, కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం బీజేపేనని నిరూపించిందని చెప్పుకుంటోంది.వచ్చే నెలలో కొత్త అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం.మొత్తం మీద తెలంగాణలో జోష్ కొనసాగిం చేందుకు కమలం పెద్దలు మెదళ్ళకు పదును పెడుతున్నారు. సంస్థాగతంగా పార్టీ నిర్మాణంపై ఫోకస్ పెట్టిన కాషాయ పార్టీ నేతలు రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెలలో అధిష్టానం కొత్త అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు జోష్‌తో పాటు, కొత్త బాస్ ఫైనల్ అయితే మరింత దూకుడు పెంచాలని బీజేపీ నేతలు స్కెచ్ గీస్తున్నారు. మరి లోకల్ బాడీ ఎలక్షన్స్ ఆ పార్టీకి ఎంత మేర కలిసి వస్తాయో చూడాలి.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆపరేటర్

సూర్యాపేట, హుజూర్‌నగర్ తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు శనివారం దాడులు చేశారు. ఈ దాడుల్లో భూ భారతి ఆపరేటర్ ఒక రైతు నుంచి రూ.12 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల ంలోని కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన తోట రాంబాబు అనే రైతుకు 12 ఎకరాల వారసత్వంగా వచ్చే గుర్తింపు ప్రొసీడింగ్ ఆర్డర్ కాపీ ఇవ్వడానికి కంప్యూటర్, భూ భారతి డేటా ఎంట్రీ ఆపరేటర్ కర్నాటి విజేతారెడ్డి

# చిదిమేసినా- అంకురించి.. మహా వృక్షమై...



సెంట్రల్ డెస్క్:కష్టజీవులను ఏకం చేసి మహా ఉద్యమం చేయాలని కమ్యూనిస్టులు భావిస్తే, మొగ్గలోనే తుంచేయాలని పాలక వర్గాలు తలుస్తుంటాయి. 1946-51 మధ్య చారిత్రాత్మకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని సైనిక బలగాల ద్వారా అణచివేయాలని భావించిన నెహ్రూ ప్రభుత్వం%ౌ% కమ్యూనిస్టుల పైన, ప్రజలపైన విరుచుకుపడి 4 వేల మంది ప్రాణాలను బలితీసుకుంది. సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించడంతో పార్టీపై నిషేధం విధించారు. రైతాంగ పోరాటానికి అండగా ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ వున్నదని, కమ్యూనిస్టులను చెట్లకు కట్టేసి నిర్దాక్షిణ్యంగా పిట్టలను కాల్చినట్టు కాల్చి చంపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోనే 17 మందిని కాల్చి చంపితే, అందులో ఐదుగురు ఒక్క చించినాడ గ్రామంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఆ విధంగా అమరులైన వారిలో చించినాడ తొలి శాఖ సభ్యులు రుద్రరాజు గోపాలరాజు, రుద్రరాజు అయ్యపరాజు, బూసి ముసలయ్య, అల్లూరి రామరాజు, బూసి వెంకట్రావు ఉన్నారు. ఈ ఐదుగురిని 1950 ఫిబ్రవరి 22 నుండి జులై 9 మధ్య ఐదు మాసాల లోపే కాంగ్రెస్ భూస్వాముల సహకారంతో పోలీసులు కాల్చి చంపారు. ఇక గ్రామంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మూలించామని భూస్వామ్య పాలక వర్గం, పోలీసువారు భావించారు. సరిగ్గా ఈ సమయంలోనే ఇంటర్మీడియట్ పూర్తి చేసి విద్యార్థి నాయకుడిగా ఉన్న చించినాడ గ్రామస్తుడు రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్.ఎన్) ఈ పరిణామాలకు రగిలిపోయి గ్రామంలో ఎర్రజెండా రెపరెపలాడాలని, ప్రజల కష్టాలు తీరాలని కంకణం కట్టుకున్నారు. ఆయనకు కేతా సూర్యారావు తదితరులు తోడయ్యారు. చిదిమేసినా%ౌ%పార్టీని తిరిగి అంకురింపచేశారు.

స్థానిక పోరాటాలతో పార్టీ నిర్మాణం

పాలక వర్గ హింసతో ప్రజలు భయభ్రాంతులై కమ్యూనిస్టు పార్టీ వైపు పోరని, అక్కడితో ఆగిపోతారని భావించారు. కాని రెట్టించిన ఉత్సాహంతో యువత పార్టీ వైపు వచ్చారు. ఆనాడు గ్రామంలో కూలి రేట్లు బాగా తక్కువగా ఉండేవి. పనిలేని రోజుల్లో ప్రజలు పస్తులుండేవారు. ఆకలి తీర్చుకోవడానికి తాటిపండ్లు కాల్చుకు తినేవారు. ఈ విధంగా సంవత్సరంలో 3 మాసాలు (ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు) పేదలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని కమ్యూనిస్టు పార్టీ గ్రహించి కలక్టరేట్‌కు ఆకలి యాత్రలు నిర్వహించి ప్రభుత్వం బియ్యం పంపిణీ చేసేలా చర్యలు చేపట్టింది. పార్టీనే స్వయంగా భూస్వామ్య, ధనిక రైతుల నుండి ప్రొక్యూర్‌మెంట్ రేటుకు సంవత్సరానికి 1000 బస్తాల ధాన్యం కొనుగోలు చేసి మిల్లు ఆడించి%ౌ%బయట మార్కెట్‌లో కిలో రూ.8 అమ్ముతుంటే రూ.1.15 పైసలకే అమ్మి పేదల ఆకలి తీర్చింది. కష్టజీవులను ఏకం చేసి పోరాడి కూలీ రేట్ల పెంపుదల సాధించింది. భూస్వాములు కక్షగట్టి చించినాడ గ్రామంలో కూలీలను పిలవకుండా బయట గ్రామంలో కూలీలను తెచ్చి పని చేయిస్తుంటే ప్రతిఘటించింది. ప్రభుత్వంపై పోరాడి లక్షల రూపాయల గ్రాంట్లు తెచ్చి ఆనాడే పనికి ఆహార పథకం సాధించింది. దీనితో పార్టీ పట్ల పేద, మధ్య తరగతి ప్రజల్లో ఎనలేని విశ్వాసం ఏర్పడింది. ఈ అంశాలన్నిటితో భూస్వామ్య వర్గాలు కమ్యూనిస్టు పార్టీపై కక్ష పెంచుకున్నాయి. నాటి కాంగ్రెస్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి పరకాల శేషావతారం సహకారంతో పార్టీపై నిర్బంధం ప్రయోగించారు.

త్యాగాలు లేనిదే కమ్యూనిస్టు ఉద్యమం లేదు

కమ్యూనిస్టు పార్టీని దెబ్బ కొట్టాలంటే పేదల్లో చీలిక ద్వారానే సాధ్యమౌతుందని గ్రహించిన భూస్వామ్య వర్గాలు ఎస్.సి, బి.సి పేటల లోని కొంతమందిని లంక భూములు ఇప్పిస్తామని, పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇతర ప్రలోభాలు పెట్టి కొద్దిమందిని చీల్చారు. 1977-80 సంవత్సరాలలో భూస్వామ్య శక్తులు వెనకుండి ఉసిగొల్పి దాడులు చేయించి ఆరుగురు సిపిఎం కార్యకర్తలను (యాండ్ర సత్యనారాయణ, వీరవల్లి నారాయణ, పంతగాని సూరన్న-చించినాడ, అనిశెట్టి కాళిదాసు, గుబ్బల సాంబమూర్తి-కాజ, గుబ్బల రామలింగయ్య-కలగంపూడి) హత్య చేయించారు. ఈ సమయంలో జరిగిన దాడిలో కేతా సూర్యారావు చేయి ముక్కలు ముక్కలుగా విరిగిపోయింది. అనేక మంది కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. పురుషులకు ధీటుగా వీరవనితలు పోరాటంలో పాల్గొని శత్రువుని వణికించారు. ఈ కాలంలోనే ఆర్.ఎస్, కేతా సూర్యారావు మరో 40 మంది ఏళ్ళ తరబడి జైలు జీవితం, అజ్ఞాతవాసం గడిపారు. 150 మంది కేసులు మోపబడి కోర్టులు చుట్టూ తిరిగారు. ఈ సమయంలో నాయకులు, ముఖ్య కార్యకర్తలు తిండికి, నిద్రకు, కుటుంబాలకు దూరమయ్యారు. శారీరక హింసలే కాక, మానసిక వేదనకు గురయ్యారు. అయినప్పటికీ ముందుకే కదిలారు. ఎన్నో త్యాగాల ఫలితంగానే గ్రామంలో పార్టీ బలోపేతం అయింది.

కమ్యూనిస్టులకు అధికారమిస్తే ఏం సాధిస్తారో చూపించిన గ్రామం

చించినాడ గ్రామ పంచాయతీ 1933-53 వరకు పెత్తందార్ల పాలనలో ఉ ంది. 1953లో కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ఆర్.ఎస్ ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నాటి నుండి 2021 వరకు 68 సంవత్సరాల పాటు రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా అవిచ్ఛిన్నంగా సిపిఎం జెండా ఎగిరింది. 62 సంవత్సరాల పాటు (1957 నుండి 2019 వరకు) వ్యవసాయ పరపతి సంఘం సొసైటీని నడిపింది. ఫీల్డ్ లేబర్ సొసైటీ ఏర్పాటు చేసి 60 ఎకరాలను పంచి 270 మంది పేదలకు పట్టాలు ఇప్పించింది. కో ఆపరేటివ్ సొసైటీ రూ.50 వేలతో ఏర్పాటు చేసి రూ.5 కోట్ల టర్నోవర్‌కి పెంచింది. గ్రామంలోని పంచాయతీ, ప్రభుత్వ స్థలాలలో వెయ్యి కొబ్బరి చెట్లు పెంచి లక్షల రూపాయలు పంచాయతీకి ఆదాయం వచ్చే చర్యలు చేపట్టింది. ప్రతి పేటలో స్కూలు, కమ్యూనిటీ హాలు, సి.సి రోడ్లు, మంచినీరు అందించింది. గ్రంథాలయాన్ని నిర్మించింది. పాలక పార్టీలు సహకరించకపోయినా ఉన్న వనరులతోనే గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేసింది.

నేడు మరింత కృషి అవసరం

ప్రజలు ఐక్యంగా వుంటే తమ దోపిడీ పాలన సాగదనుకున్న పాలకవర్గాలు మతం, ప్రాంతం, కులం, భాష, లింగ పరంగా విభజించే ప్రయత్నాలే సాగిస్తున్నా యి.పాలక పార్టీలు అనేకం పుట్టుకొచ్చి శ్రామిక వర్గాన్నే మరింత చీల్చేస్తున్నాయి. అనేక భ్రమలు కలిగించి తమతోనే ఉండే విధంగా విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. భూస్వామ్య, ధనిక శక్తులు పార్టీల పరంగా చీలిపోయినా వర్గ సమస్యలపుడు వారంతా సులభంగా ఒక్కటైపోతున్నారు. కాని శ్రామిక వర్గం కుల, రాజకీయ వైరుధ్యాలతో చీలిపోయేలా చేస్తున్నారు. శ్రామిక వర్గాన్ని కూడగట్టడం సంక్లిష్టంగా మారిన నేటి పరిస్థితుల్లో మరింత నైపుణ్యంతో నూతన పద్ధతులలో పని చేయాలి. ప్రజలకు మరింత చేరువ అవ్వడం ద్వారానే తిరిగి చెదిరిపోయిన శ్రేణులను రాబట్టుకోగలుగుతాం. ఉద్యమాన్ని పున:నిర్మించి ముందుకు తీసుకుపోవడమే అమరవీరులకు మనం అర్పించే ఘన నివాళి.

# తాటికాయ గ్రామంలో అమానవీయం

హనుమకొండ,జిల్లాలో అత్యంత అమానవీయ ఘటన చోటు చేసుకుంది. ఓ మహిళను వివస్త్రను చేసి చిత్రవధ చేసిన ఘటన వెలుగు చూసింది. ధర్మసాగర్ మండలం తాటికాయలలో ఈ దారుణం జరిగింది. వివాహేతర సంబంధం పెట్టుకుందని ఓ మహిళను ఇనుప గ్రిల్స్ కట్టి, వివస్త్రను చేసి జననాంగాలపై జీడి పోసి చిత్రవధకు గురి చేశారు. తప్పు చేశామని క్షమించాలని వేడుకున్నా కూడా వినకుండా దాడి చేశారు. ఈ ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.తాటికాయల గ్రామానికి చెందిన యువతితో మునుగు మండలం బోలోలుపల్లికి చెందిన రాజుకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. అయితే ఇటీవల కాలంలో రాజు.. మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. పదిరోజుల క్రితం ఇద్దరు కలిసి గ్రామం నుంచి పారిపోయారు. వీరిద్దరి కోసం గాలించిన రాజు కుటుంబ సభ్యులు ఎట్టకేలకు వారిని వెతికి పట్టుకుని తాటికాయల గ్రామానికి తీసు కొచ్చారు.ఆపై మహిళ పట్ల అత్యంత కిరాతకంగా వ్యవహరించారు. ఆమెను ఇనుప గ్రిల్స్‌కు కట్టి వివస్త్రను చేసి జననాంగాలపై జీడి పోసి దారుణంగా చిత్రవధ చేశారు. తరువాత ఇద్దరికీ గుండు గీయించారు. ఐదు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన నేడు వెలుగులోకి వచ్చింది. ఈ దారుణ ఘటన అనంతరం రాజు, మహిళ కనిపించకుండా పోయారు. మహిళపై దాడి దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. దీంతో ధర్మసాగర్ పోలీసులు తాటికాయల గ్రామానికి చేరుకుని దాడిలో పాల్గొన్న కుటుంబసభ్యుల వివరాలను సేకరించారు. మహిళను చిత్ర హింసలకు గురిచేసిన కుటుంబాన్ని అదుపులోకి తీసుకున్నారు. అలాగే కనిపించ కుండా పోయిన రాజు, మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# బీజేపీ నూతన అధ్యక్షుడు ఎవరు?

ఢిల్లీ:తెలంగాణ రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు నియామకానికి సమయం ఆసన్నమైంది. మరికొద్ది రోజుల్లో తెలంగాణ బీజేపీకి నూతన అధ్యక్షుడు రాబోతున్నారనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. మరో మూడు నెలల్లోపే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న తరుణంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిపై అధిష్టానం తీవ్రంగా దృష్టి సారించింది. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి స్థానంలో మరొకరి పగ్గాలు అప్పగించేందుకు ఇప్పటికే అధిష్టానం సిద్ధమైనట్లు తెలుస్తోంది. తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడి రేసులో ఈటల రాజేందర్‌తో పాటు ధర్మపురి అరవింద్‌లు ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. దీనిపై అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు, వచ్చే నెల ఒకటో తేదీనే ప్రకటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిలో భాగంగా ఈనెల 30వ తేదీన నామినేషన్ల ప్రక్రియ జరగనుంది. అదే సమయంలో ఏపీ బీజేపీ నూతన అధ్యక్షుడి నియామకం కూడా జరగనుంది. ఈ రెండు నామినేషన్ల ప్రక్రియ ఈనెల చివరన నిర్వహించే జూలై 1వ తేదీన కొత్త అధ్యక్షుల్ని ప్రకటించే యోచనలో ఉన్నారు. తెలంగాణ బిజెపి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా శోభ కరంద్లాంజె నియమించగా, ఏపీ బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పీసీ మోహన్‌ను నియమించారు.బోధనా సిబ్బంది కొరత, స్కాలర్‌షిప్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో ఆలస్యంపై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రం అందజేసిన ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 30 నుంచి చేపట్టిన ధర్నాలో రాష్ట్ర వ్యాప్తంగా జూడాలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# కవిత ఎవరు?

హైదరాబాద్,బీసీలకు బ్రాండ్ అంబాసిడర్ గా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేస్తున్న విన్యాసాలు అందరికీ తెలిసినవే. బీఆర్ఎస్ 9 ఏళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్నప్పుడు జ్యోతిబా పూలే పేరు కూడా ఎత్తని కవిత, అధికారం పోగానే, అసెంబ్లీ ఆవరణలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలంటూ రాగం తీస్తున్నారు. బీసీ మంత్రం జపిస్తున్నారు. కవిత డబుల్ గేమ్ పై ఓ రేంజ్ లో ధ్వజమెత్తారు బీజేపీ నేత రఘునందన్ రావు. అసలు కవిత ఎవరు, బీసీనా అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు.కవిత ఎవరు ? ఆమె బీసీ సామాజిక వర్గానికి చెందిన లీడరా బీఆర్ఎస్ హయాంలో బీసీలకు కేసీఆర్ చేసిన ద్రోహానికి చింతిస్తూ కవిత లెంపలు వేసుకోవాలి. ఆమె బోధించడం కంటే ముందు ఆచరించడం నేర్చుకోవాలి

బీసీలకు ఏమిచ్చారు..?

బీసీలకు మద్దతుగా వస్తున్న కవిత కానీ, ఆమె పార్టీ కానీ అసలు బడుగు బలహీన వర్గాలకు ఏం చేసిందంటూ ప్రశ్నించారు రఘునందన్ రావు. బీఆర్ఎస్ లో ఎప్పుడూ బీసీలకు అన్యాయమే జరిగిందని విమర్శించారు. కవితకు బీసీలపై అంత ప్రేమ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు పదవులు ఎందుకివ్వలేదన్నారు. బీసీ మంత్రుల్ని సైతం అవమానించి పార్టీనుంచి బయటకు పంపేశారని చెప్పారు. పార్టీ అధ్యక్ష పదవి బీసీలకిచ్చారా, కనీసం సీఎల్పీ నేత పదవి అయినా బీసీలకిచ్చారా అంటూ లాజిక్ తీశారు. బీఆర్ఎస్ హయాంలో బీసీలకు కేసీఆర్ చేసిన ద్రోహానికి చింతిస్తూ కవిత లెంపలు వేసుకోవాలన్నారు. గన్ పార్క్ నుంచి నడుచుకుంటూ వెళ్లి అమర వీరుల విగ్రహాల వద్ద నిలబడి క్షమాపణలు అడగాలన్నారు. పార్టీకి సంబంధించిన ఏ పదవి కూడా బీసీలకు ఇవ్వకుండా, వారిని ఎదగనీయకుండా చేశారని మండిపడ్డారు.

ఆచరించడం నేర్చుకో..

అంబేద్కర్ చెప్పినట్టు బోధించడం కంటే ముందు కవిత ఆచరించడం నేర్చుకోవాలన్నారు రఘునందన్ రావు. బీసీలకు అన్యాయం జరుగుతోందని మొసలి కన్నీరు కారుస్తున్న కవిత, అసలు బీఆర్ఎస్ తరపున బీసీలకోసం ఏం చేశారని నిలదీశారు. వాస్తవానికి బీసీలను అవమానించిన పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు. అధికారం పోగానే ఇప్పుడు కవితకు బీసీలు కావాల్సి వచ్చారని, ఇప్పుడు కూడా కేవలం రాజకీయాలకోసమే బీసీల పేరుని వాడుకోడానికి ఆమె ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో బీసీలకు ఏం న్యాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలకోసం వస్తున్న కవితను వారంతా నిలదీయాలన్నారు.

బిర్యానీపై విమర్శలు..

బీసీల తరపున మాట్లాడుతూ తన ద్వంద్వ వైఖరి బయటపెట్టుకుంటున్న కవిత, ఇటీవల ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేలా ఆంధ్రోళ్ల బిర్యానీ అనే వ్యాఖ్యలు చేశారు. కవిత కామెంట్లపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ నడుస్తోంది. ఆమెకు ఆంధ్రోళ్ల బిర్యానీ ఏం నచ్చుతుందని, తీహార్ జైలులో చిప్పకూడు రుచిగా ఉంటుందని ట్రోల్ చేస్తున్నారు నెటిజన్లు. అటు తెలంగాణ వైపు నుంచి కూడా కవిత వ్యాఖ్యలపై ఎక్కడా స్పందన లేదు. అధికారం లేనప్పుడు ప్రాంతీయ, కుల విద్వేషాలు రెచ్చగొట్టడం బీఆర్ఎస్ నేతలకే చెల్లిందని అంటున్నాయి ప్రత్యర్థి పార్టీలు. కవితకు చిత్తశుద్ధి ఉంటే, ముందు పార్టీ ప్రెసిడెంట్ పదవి కానీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కానీ బీసీలకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు నేతలు. పార్టీలో లుకలుకలను కవర్ చేసేందుకు కవిత పదే పదే మీడియా ముందుకొస్తున్నారు. బీఆర్ఎస్ తరపున వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నా,

# కూటమి ఐక్యతకు మోడీ అభయం...



న్యూఢిల్లీ,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకుంది. ఈ ఏడాది కాలంలో అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి పరంగా కూడా నాయకులు అడుగులు వేశారు. పింఛన్ల పెంపు నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల వరకు తొలి ఏడాది అమలు చేశారు. అదే సమయంలో అమరావతి ప్రాజెక్టును లైన్ లో పెట్టారు. ముందుకు సాగిస్తున్నారు. ఇక నాయకుల పరంగా చూసుకుంటే పై స్థాయిలో పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఉమ్మడిగా కలిసి ఉంటున్నారు. బిజెపి కూడా కలిసే ఉంటుంది. అయినప్పటికీ అంతర్గత విభేదాలు క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య సఖ్యత లోపిస్తున్న పరిణామాలు కనిపిస్తున్నాయి.చాలా నియోజకవర్గాల్లో కూటమి ఎమ్మెల్యేలు కూటమి మంత్రుల మధ్య సఖ్యత లేదనేది వాస్తవం. ఈ విషయం సీఎం చంద్రబాబు కూడా పదేపదే చెప్పుకొచ్చారు. ఈ పరిణామాలను గమనిస్తున్న కొందరు విశ్లేషకులు ఈ కూటమిలో విభేదాలు వస్తాయని చెప్పుకొస్తున్నారు. అయితే దీనిలో వైసిపి ప్రయోజనాలు ఉన్నాయా లేకపోతే రాజకీయంగా నిజంగానే వారు వేస్తున్న అంచనాలు నిజమా అనేది పక్కన పెడితే.. అసలు వాస్తవం ఏంటి కూటమి నిజంగానే బెసుకుతుందా? అనేది ఆసక్తికర అంశం. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే వచ్చే ఎన్నికల వరకు కూడా కూటమికి ఎటువంటి అపాయం లేదనేది స్పష్టంగా కనిపిస్తోంది.దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని నరేంద్ర మోడీ. గత ఎన్నికల ముందు కూటమి కట్టడం కోసం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చాలా ప్రయత్నం చేశారు. ఈ విషయం అందరికీ తెలిసిందే. కూటమి కట్టారు అధికారంలోకి వచ్చారు. ఇంతవరకు బాగానే ఉంది. ఈ కూటమి అవసరం చంద్రబాబుకు అటు పవన్ కళ్యాణ్ కు ఉన్న లేకపోయినా పర్వాలేదు. ఎందుకంటే పూర్తిస్థాయి మెజారిటీతో 134 మంది ఎమ్మెల్యేలతో టిడిపి బలంగా ఉంది. కాబట్టి కూటమి విడిపోయిన టిడిపి ప్రభుత్వం కొనసాగుతుంది. ఇక, జనసేన విషయానికి వస్తే.. 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.కాబట్టి తాము బయటకు వస్తే ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కుతుందనేది వారి భావన. ఇక ఎటోచ్చీ బిజెపికి మాత్రం తీవ్ర నష్టం జరుగుతుంది. అది ఎలా అంటే.. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి ఎట్లా ఉన్నా ఎమ్మెల్యేలు ఎంపీల పరిస్థితి ఎట్లా ఉన్నా.. కేంద్రంలో మోడీ ప్రధానిగా ఉండడానికి కారణం కూటమిగా ఉన్న ఏపీ నుంచి మద్దతిస్తున్న ఎంపీలు మాత్రమే. ఈ విషయం అందరికీ తెలిసిందే. కాబట్టి కూటమిని కాపాడుకోవడం అనేది ఇప్పుడు పవన్ చేతుల్లో కానీ చంద్రబాబు చేతుల్లో కానీ లేదు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతిలోనే ఉంది. ఆయనకి ఇప్పుడు కూటమి అవసరం కాబట్టి.. కూటమి బాగానే ఉంటుంది.ఒకవేళ నిజంగా విభేదాలు తలెత్తితే.. కేంద్రమే రంగంలోకి దిగి అవసరమైతే చర్చలు జరిపి కూటమిని కాపాడుకునే పరిస్థితి ఉంది. తప్ప కూటమిని విచ్ఛిన్నం చేసుకునే పరిస్థితి అయితే కనిపించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉండాలి. 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ విజయం దక్కించుకోవాలి అంటే కచ్చితంగా ఏపీ ఇప్పుడు ప్రధాని మోడీకి చాలా అవసరం. సో ఓటమిలో విబేధాలు ఉన్నా.. ఐక్యత విషయంలో ఎలాంటి వ్యతిరేక చర్చకు తావు లేదనేది పరిశీలకులు చెబుతున్న మాట.

# సొంతపార్టీ నేతలపై మహిళా ఎంపీ ఫైర్!



కోల్ కత్తా,కోల్ కతాలోని ఓ న్యాయ కళాశాల విద్యార్థిని(24)పై జూన్ 25న అత్యాచార ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే! ఈ ఘటనతో అధికార పార్టీపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు ఈ అత్యాచార ఘటనపై టీఎంసీ నేతలు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇందులో భాగంగా... విద్యార్థినిపై ఆమె స్నేహితులు అత్యాచారం చేస్తే ఎవరేం చేస్తారంటూ ఎంపీ కల్యాణ్ బెనర్జీ అన్నారు.ఇదే సమయంలో.. కాలేజీల్లో పోలీసులు ఉంటారా అని ప్రశ్నించారు. ఇక ఎమ్మెల్యే మదన్ మిత్రా స్పందిస్తూ... ఆ విద్యార్థిని ఒంటరిగా కాలేజీకి వెళ్లకపోతే ఇలాంటి ఘటన జరిగి ఉండేది కాదని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీంతో... ఆ వ్యాఖ్యలు పూర్తిగా వారి వ్యక్తిగతమైనవని.. పార్టీకి ఎలాంటి సంబంధం లేదని టీఎంసీ ఓ ప్రకటన విడుదల చేసింది.ఈ విధంగా... బాధితురాలిదే తప్పన్నట్లుగా అధికారిక టీఎంసీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి, బాధిత కుటుంబంలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. పార్టీలోని నేతలు చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా స్పందించారు. ఈ సందర్భంగా.. సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ... 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు.ఈ సందర్భంగా సొంతపార్టీ నేతలకు పరోక్షంగా చురకలు అంటించారు. ఇందులో భాగంగా... భారత్ లోని అన్ని పార్టీల్లోనూ స్త్రీ ద్వేషులు ఉన్నారని చెప్పిన మహువా... అలాంటి అసహ్యకరమైన వ్యాఖ్యలు ఎవరు చేసినా తమ పార్టీ ఖండిస్తుందంటూ పేర్కొన్నారు. విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోందని తెలిపారు.ఇదే సమయంలో.. ఘటనపై ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన పోలీసులు.. 12 గంటల్లోపే నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. మహిళలపై జరిగే నేరాలను టీఎంసీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఏ మాత్రం సహించదని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష బీజేపీ పైనా ఆమె విమర్శలు చేశారు.కాగా... కోల్ కతాలోని ఓ న్యాయ కళాశాల విద్యార్థినిపై పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు కాలేజీ క్యాంపస్ లోనే అత్యాచారానికి ఒడిగట్టిన సంగతి తెలిసిందే! ఈ సందర్భంగా... విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగినట్టు వైద్య పరీక్షల్లో రూఢీ అయిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

# మాజీ సీఎంకు ఏపీ బీజేపీ పగ్గాలు.. నిజమేనా?

అమరావతి,ఏపీలో బీజేపీ అధ్యక్ష పదవిని కొత్తవారికి అప్పగించేందుకు రంగం రెడీ అయింది. గత ఏడాది ఎన్నికలకు ముందు ఏపీ బీజేపీ సారథిగా పగ్గాలు చేపట్టిన మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి.. బీజేపీ–టీడీపీ–జనసేన కూటమి కట్టేందుకు.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బాగానే కృషి చేశారని చెప్పాలి. అయితే.. రెండేళ్లకు మాత్రమే పరిమితం అయ్యే ఈ పదవిని తాజాగా మార్పు చేయాలని బీజేపీ అధిష్టానం నిర్ణయించింది. మొత్తంగా 9 రాష్ట్రాల్లో బీజేపీ చీఫ్‌లను మార్చను న్నారు. వీరితోపాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను కూడా మార్చేయనున్నారు.వాస్తవానికి ఈ ఏడాది జనవరితోనే ఏపీ బీజేపీ అధ్యక్షురాలు సహా.. 9 రాష్ట్రాల అధ్యక్షులను కూడా బీజేపీ మార్చాల్సి ఉంది. అయితే.. పార్లమెంటు సమావేశాలు, ఇంతలోనే పహిల్గాం ఉగ్రదాడి సహా పలు సమస్యలు రావడంతో నాయకులు ఈ విషయాన్ని పక్కన పెట్టారు. తాజాగా బీహార్ సహా వచ్చే ఏడాది పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. దీనికితోడు.. ఏపీలోనూ వచ్చే ఏడాది స్థానిక ఎన్నికలకుముహూర్తం పెట్టనున్నారు. ఈ క్రమంలో పార్టీ పరంగా మార్పు ఖాయమని కొన్నాళ్లుగా సూచనలు అందాయి. ఈ క్రమంలో కమల నాథులు క్యూ కట్టారు.కీలకమైన బీజేపీ ఏపీ చీఫ్ పదవిని దక్కించుకునేందుకు బీసీ, ఓసీ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు లైన్‌లో ఉన్నారు. వీరిలో ప్రధానంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చిట్ట చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి పేరు జోరుగా వినిపిస్తోంది. ఆయన కాంగ్రెస్‌ను వీడిన తర్వాత.. పలు పార్టీల్లోకి వెళ్లారు. చివరకు రెండేళ్ల కిందట బీజేపీ కండువా కప్పుకొన్నారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గం నుంచి పార్లమెంటుకుపోటీ చేశారు. కూటమి



ప్రభావంతో చాలా మంది అభ్యర్థులు విజయం దక్కించుకున్నా కిరణ్‌కుమార్‌రెడ్డి పరాజయం పాలయ్యారు.ఈ క్రమంలో ఆయన కొన్నాళ్లుగా తన స్థాయికి తగిన పదవి కోసం వేచి చూస్తున్నారు. తాజాగా ఏపీ బీజేపీ చీఫ్ పదవి ఖాళీ అవుతుండడంతో ఆయనను నియమిస్తారన్న చర్చ జరుగుతోంది. దీనికి మరో కారణం కూడా వినిపిస్తోంది. రెడ్డి సామాజిక వర్గాన్ని ప్రభావితం చేయడం ద్వారా వైసీపీని టార్గెట్ చేయొచ్చని .. బీజేపీ నాయకులు భావిస్తున్నారు. ఇప్పుడు రెడ్డి సామాజిక వర్గం ఎక్కువగా వైసీపీకి అనుకూలంగా ఉంది. ఈ క్రమంలో తటస్థంగా కూడా చాలా మంది ఉన్నారు. వీరిని ఆకర్షించేందుకు కిరణ్ కుమార్ రాజకీయం పనిచేస్తుందన్న చర్చ ఉంది. ఈ నేపథ్యంలోనే కిరణ్‌కుమార్‌కు ఏపీ బీజేపీపగ్గాలు అప్పగించే అవకాశం ఉందని మెజారిటీ నాయకులు భావిస్తున్నారు.వచ్చే నెల 1న సాయంత్రానికి కానీ దీనిపై క్లారిటీ వచ్చేఅవకాశం లేదు.

# రాజాసింగ్‌కు పగ్గాలా? బీజేపీలో తలోమాట!



న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా ఒకేసారి 9 రాష్ట్రాల్లో బీజేపీ ఆయా రాష్ట్రాల అధ్యక్షులను మార్చుతోంది. కొందరికి కొనసాగే అవకాశం కూడా కల్పించనుందనే చర్చ సాగుతోంది. ఈ క్రమంలో తెలంగాణ విషయం హాట్ టాపిక్‌గా మారింది. దేశవ్యాప్తంగా నిర్దేశిత రాష్ట్రాల్లో బీజేపీ చీఫ్‌లకు సంబంధించి సంస్థాగత ఎన్నికలను నిర్వహిస్తారు. దీనికి ఎవరైనా పోటీ చేయొచ్చు. సోమవారం దీనికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభం అవుతుంది. అదే రోజు పదవిని కాంక్షిస్తున్నవారు.నామినేషన్ దాఖలు చేసుకునే అవకాశం ఉంది. దీంతో ఆశావహులు ఆగమేఘాలపై రెడీ అవుతున్నారు.ఇలాంటి వారిలో తెలంగాణ రాష్ట్ర బీజపీ పగ్గాల కోసం ఫైర్ బ్రాండ్ నాయకుడు, ఘోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పోటీ పడాలని భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా చెప్పుకొచ్చారు. నేను పోటీ చేస్తా! అని కూడా ప్రకటించారు. అంతేకాదు.. తనను ఎవరూ కాదనలేరని.. ఎమ్మెల్యేగా ఉన్న వారిని పోటీ చేయకూడదని ఎక్కడా చెప్పలేదని కూడా రాజా వ్యాఖ్యానించారు. తన నామినేషన్ పత్రాలను తానే స్వయంగా అందించనున్నట్టు కూడా రాజా సింగ్ ప్రకటించారు. ఇక్కడితో కూడా ఆగకుండా ప్రస్తుత చీఫ్ కిషన్ రెడ్డిపైనా కామెంట్లు చేశారు.తనను కిషన్ రెడ్డే నామినేట్ చేస్తే సంతోషిస్తానని రాజా సింగ్ చెప్పారు. తాను నామినేషన్ వేయడం ఖాయమని కూడా వెల్లడించారు. ఇదిలావుంటే.. ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ చీఫ్‌గా ఉన్న కిషన్ రెడ్డికి ఇప్పటికే చాలా రోజులు పొడిగింపు ఇచ్చారు. గతంలో బండి సంజయ్ చీఫ్ గా ఉన్న విషయం తెలిసిందే. అయితే.. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్న నేపథ్యంలో రెండు బాధ్యతలు ఆయనకు ఇబ్బందిగా మారడంతో ఆయనను తప్పించనున్నారు. మరోవైపు.. ఈ సీటును సొంతం చేసుకునేందుకు.. మాజీ మంత్రి డీకే అరుణ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం ఉంది. అదేసమయంలో గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా చేసిన లక్ష్మణ్ కూడా ఈ ప్రయత్నాల్లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.ఇదిలావుంటే.. అసలు రాజాసింగ్ ప్రకటనపై సొంత పార్టీ నాయకులు ఏమనుకుంటున్నారన్నది ఆసక్తిగా మారింది. రాజానా? అంటూ.. ఒకరిద్దరు ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. ఆయనను పార్టీ చీఫ్ చేస్తే.. రోజుకో కేసు.. పూటకో పోలీసు స్టేషన్ చుట్టూ తిరగాల్సి ఉంటుందని మరికొందరు నాయకులు ఆఫ్ దిరికార్డుగా వ్యాఖ్యానించారు. రాజాసింగ్ ఉంటే బీజేపీ పూర్తిగా హిందూత్వ అజెండాను అమలు చేసేందుకు అవకాశం ఉంటుందనికొందరు అంటే.. అంత హిందూత్వ అయితేరాష్ట్రంలో కష్టమని కొందరు వ్యాఖ్యానించారు.ఇలారాజాసింగ్‌కు పగ్గాలపై తలోమాట మాట్లాడడం గమనార్హం.

# మరో 2 నెలల్లో కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ?

కర్ణాటక,కర్ణాటకలో మరో రెండు, మూడు నెలల్లో డీకే శివ కుమార్ సీఎంగా బాధ్యతలు స్వీకరించే ఛాన్స్ ఉందని అక్కడి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. ప్రస్తుతం పార్టీ హైకమాండ్ శివకుమార్ గురించే మాట్లాడుతోందని తెలిపారు.కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ త్వరలో ముఖ్యమంత్రి పదవి స్వీకరిస్తారంటూ గత కొన్ని రోజులుగా ప్రచారం నడుస్తోంది. అక్కడి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. మరో రెండు, మూడు నెలల్లో డీకే శివ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే ఛాన్స్ ఉందని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం పార్టీ హైకమాండ్ శివకుమార్ గురించే మాట్లాడుతోందని తెలిపారు. ఈ ఏడాది చివర్లో కర్ణాటక ప్రభుత్వంలో సీఎం మార్పు గురించి ఊహాగానాలు వస్తున్నాయి. ఇలాంటి తరుణంలో డీకే శివకుమార్‌కు సన్నిహితుడైన ఇక్బాల్ హుస్సేన్ ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమవుతోంది. కర్ణాటకలో సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక పరిణామాలు ఉంటాయని కర్ణాటక మంత్రి కె. ఎన్ రాజన్న ఇటీవల అన్నారు. ఈ క్రమంలోనే త్వరలో సీఎం మార్పు ఉంటుదని కాంగ్రెస్‌లో కూడా విస్తృతంగా చర్చలు నడుస్తున్నాయి.



ఈ విషయంపై ఇప్పటికే సీఎం సిద్ధరామయ్య కూడా పలుమార్లు స్పందించారు. నాయకత్వ మార్పు అనేది అధిష్ఠానం పరిధిలో ఉందని.. ఈ విషయంలో తాను బహిరంగంగా మాట్లాడలేనని తెలిపారు. ఇదిలాఉండగా కర్ణాటకలో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక సీఎం పదవిపై తీవ్ర స్థాయిలో చర్చలు జరిగాయి. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకరించారనే వార్తలు వచ్చాయి. దీంతో శివకుమార్ సీఎం పదవి స్వీకరించే సమయం వచ్చిందనే ప్రచారం జోరుగా నడుస్తోంది.

# అమెరికాలోని ఎన్ఆర్ఐలకు భారీ ఊరట.!



అమెరికా,అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు ఇది నిజంగా ఒక శుభవార్త! అమెరికా సెనెట్ తాజాగా ప్రతిపాదించిన ముసాయిదా ప్రకారం.. రిమిటెన్స్ ట్రాన్స్‌ఫర్ టాక్స్‌ను గణనీయంగా తగ్గించారు. ఇదివరకు ఉన్న 3.5 శాతం నుండి కేవలం 1 శాతానికి ఈ పన్నును తగ్గించడం ద్వారా భారతదేశానికి నిత్యం డబ్బులు పంపే ఎన్ఆర్ఐలకు భారీ ఊరట లభించనుంది.

**ట్రంప్ బిల్‌లో కీలక మార్పులు**

ఈ ముఖ్యమైన సవరణలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన "వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్ యాక్ట్" ముసాయిదాలో భాగంగా తీసుకొచ్చారు. తొలుత హౌస్‌లో 5 శాతం రేటును ప్రతిపాదించగా.. తరువాతి దశలో దానిని 3.5 శాతానికి తగ్గించారు. ఇప్పుడు సెనెట్ విడుదల చేసిన ముసాయిదాలో ఈ పన్ను రేటును ఏకంగా 1 శాతానికి తగ్గించడం విశేషం.

**ఈ టాక్స్ ఎవరికి వర్తిస్తుంది?**

గ్రాంట్ థార్న్టన్ భారత్‌లో యుఎస్ టాక్స్ పార్ట్‌నర్ అయిన లాయిడ్ పింటో వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ టాక్స్ డబ్బు పంపకాల్లో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వర్తిస్తుంది. అవి ఏంటంటే..క్యాష్ ద్వారా పంపిన ట్రాన్స్‌ఫర్‌లకు అంటే, నగదు రూపంలో చేసే బదిలీలకు వర్తిస్తుంది.. మనీ ఆర్డర్, క్యాషియర్ చెక్ లేదా ఇతర ఫిజికల్ పేమెంట్ టూల్స్ ద్వారా పంపే పంపకాలకు ఇది వర్తిస్తుంది. భౌతికంగా చేసే చెల్లింపు సాధనాల ద్వారా జరిగే లావాదేవీలకు మాత్రమే ఈ టాక్స్ వర్తిస్తుంది.అయితే ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే.. అమెరికాలోని బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల ఖాతాల్లో ఉన్న డబ్బుల ద్వారా జరిపే ట్రాన్స్‌ఫర్లు, లేదా అమెరికా జారీ చేసిన డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే ట్రాన్స్‌ఫర్లు ఈ టాక్స్‌కు లోబడి ఉండవు.

**ఎప్పుడు అమల్లోకి వస్తుంది?**

ఈ కొత్త రిమిటెన్స్ టాక్స్ నిబంధనలు 2025 డిసెంబరు 31 తర్వాత అమలులోకి వస్తాయి. ఈలోగా సెనెట్ ఈ బిల్లును జూలై 4వ తేదీలోగా ఆమోదించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**ఎన్ఆర్ఐలకు గొప్ప ఊరట**

ఈ నూతన ముసాయిదా ప్రవాస భారతీయులకు ఎంతగానో ఉపశమనంగా మారనుంది. ఎందుకంటే వారు తమ కుటుంబ సభ్యులకు డబ్బు పంపేటప్పుడు బ్యాంకు ఖాతాలు లేదా కార్డులు ఉపయోగిస్తే టాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది ముఖ్యంగా చిన్న మొత్తాలను తరచుగా పంపేవారికి.. అధిక సంఖ్యలో ఎన్ఆర్ఐలకు భారీ ఉపశమనాన్ని కలిగిస్తుంది. అమెరికాలో ఎన్ఆర్ఐలు ఎక్కువగా డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారానే డబ్బు పంపడం వల్ల, ఇది వారందరికీ నిజంగా ఒక పెద్ద రిలీఫ్ అని చెప్పొచ్చు.ఈ బిల్లు ఆమోదంతో ప్రవాస భారతీయులు తమ కష్టార్జితాన్ని స్వదేశానికి మరింత సులభంగా.. తక్కువ పన్ను భారంతో పంపగలుగుతారు.


# మీడియాకు ఈ రేంజి వార్నింగ్ ఇదే తొలిసారి!



హైదరాబాద్,తెలంగాణ రాజధాని హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మహాన్యూస్ టీవీ ఛానెల్ కార్యాలయంపై శనివారం విపక్ష బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడి తీవ్రత ఏ రేంజిలో ఉందంటేదాడి జరిగిన మరుక్షణమే సదరు కార్యాలయాన్ని మహాన్యూస్ ఖాళీ చేసి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఈ దాడి రెండు తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపగాదానిని మించి ఆదివారం బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరింత దారుణంగా ఉన్నాయని చెప్పాలి. అసలు మీడియాకు ఈ రేంజి వార్నింగ్ ఇప్పటిదాకా వచ్చిన దాఖలానే లేదని కూడా చెప్పాలి.ఆదివారం మహాన్యూస్ పై జరిగిన దాడి గురించి మాట్లాడేందుకు మీడియా ముందుకు వచ్చిన జగదీశ్ రెడ్డి..మహాన్యూస్ ఆఫీస్ పై జరిగిన దాడి బీఆర్ఎస్ చేసిందేనని ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అంతేకాకుండా ఆ మాత్రం దానినే దాడి అనుకుంటే ఎలాగని ప్రశ్నించిన ఆయన అది కేవలం నిరసన మాత్రమేనని సంచలన వ్యాఖ్య చేశారు. మహాన్యూస్ ఛానెల్ మాదిరే రాష్ట్రంలో ఇంకో రెండు, మూడు సంస్థలు ఉన్నాయని చెప్పిన జగదీశ్..వాటి పని కూడా పడతామని చెప్పారు. వాటిపై జరిగే దాడులు మామూలుగా ఉండవని కూడా ఆయన బహిరంగ వ్యాఖ్యలు చేశారు.అంతటితో ఆగని జగదీశ్ రెడ్డితమ పార్టీ అధినేత కేసీఆర్ క్షమించినా యెల్లో మీడియాను తాము మాత్రం వదిలిపెట్టేది లేదని ఆయన మరింత తీవ్రమైన వ్యాఖ్య చేశారు. తాము టార్గెట్ చేసిన మీడియా సంస్థలను ఏ పోలీసు కూడా కాపాడలేరని ఆయన హెచ్చరించారు. ఇక ఆ తర్వాత నేరుగానే విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన జగదీశ్ రెడ్డి "మీ బలుపు ఏంది? మీ అహంకారం ఏంది? ఎవడ్ని చూసుకుని మీకు ఈ బలుపు? ఎన్ని జరిగినా దాడి అయితే మొదలుపెట్టం అని మాత్రం అనుకోకండి. ఎక్కడ ఉంటున్నారు? ఎక్కడ బతుకుతున్నారు? ఎవరి తిండి తింటున్నారు. మా సహనానికి కూడా పరీక్ష అయిపోయింది" అని ఆయన తనదైన శైలి బెదిరింపు వ్యాఖ్యలు చేశారు.కొందరు వ్యక్తులు తెలంగాణలో మీడియా హౌస్ ల పేరిట కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని వ్యక్తిగత హననానికి పాల్పడుతున్నారని, అందుకోసం స్లాటర్ హౌస్ లు నడుపుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ఇక్కడ మా మీడియా మా ఇష్టం వచ్చినట్లు రాస్తాం అంటే మాత్రం ఇకపై తెలంగాణలో కుదరదని ఆయన వార్నింగ్ ఇచ్చారు. ఇలా చేస్తే ఎవడు ఊరుకుంటాడు అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ ఆంధ్ర నుంచి తెలంగాణను వీడదీశారన్న కోపంతోనే ఈ రాతలు రాస్తున్నారని ఆయన మండిపడ్డారు.

# చార్‌ధామ్ యాత్రపై ఆంక్షలు ఎత్తివేత

ఉత్తరాఖండ్ :ఉత్తరాఖండ్ లో భారీ వర్షాల కారణంగా చార్‌ధామ్ యాత్ర ను 24 గంటలు నిలిపివేసిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా పరిస్థితులు మెరుగుపడటంతో 24 గంటల నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. గర్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే ఈ మేరకు ప్రకటించారు. 'చార్‌ధామ్ యాత్రపై 24 గంటల నిషేధాన్ని ఎత్తివేశాం' అని ప్రకటించారు. వాతావరణ పరిస్థితులను బట్టి ఆయా జిల్లాల కలెక్టర్లు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే వాహనాలను నిలిపివేయాలని సూచించారు. కాగా, ఉత్తరాఖండ్‌లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణ హెచ్చరికలతో చార్‌ధామ్ యాత్రను తాత్కాలికంగా



నిలిపివేస్తున్నట్లు అధికారులు ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**